జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



కృష్ణ | శుక్రవారం 24 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక :191 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం విశేషం: జాతీయ థ్రెడ్ల్ ఇంజనీర్స్ దినోత్సవం సూర్యోదయం: 5:37 । సూర్యాస్తమయం: 6:30 చంద్రోదయం: 2:24 । చంద్రాస్తమయం: 1:49 తిథి: శుద్ధ దశమి ఉ. 9:56 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం: అనురాధ పూర్తి రోజు యోగం: శుక్లం రా. 10:30 వరకు, తదుపరి బ్రహ్మం కరణం: గరజ ఉ. 9:56 వరకు, తదుపరి వణిజ రా. 10:49 వరకు, తదుపరి భద్ర

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## డీఆర్‌డీఓ మరో ఘనత

- 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం
- విజయవంతంగా 'కుశ' క్షిపణి తొలి ప్రయోగం
- ఒడిశా తీరంలో పరీక్ష నిర్వహించిన డీఆర్‌డీఓ
- సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం
- రక్షణ రంగంలో ఇదొక మైలురాయి అన్న రాజ్‌నాథ్ సింగ్
- విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వెల్లడి



## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

- ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..
- ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ
- దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా
- తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టేది లేదన్న మోదీ






### ప్రపంచ అనిశ్చితుల మధ్యా భారత్ బలంగా ముందుకు సాగుతోంది

- వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటన్న ఆర్‌బీఐ
- జూన్ వరకు ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగినట్లు వెల్లడి



### సిలిండర్‌పై రూ.700కుపైగా సబ్సిడీ!

- పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై క్లారిటీ ఇవ్వని కేంద్రం
- అంతర్జాతీయ ధరలు పెరిగినా రూ.942కే గృహ ఎల్పీజీ సిలిండర్
- 14.2 కిలోల సిలిండర్‌పై జూన్‌లో రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ

# ప్రతి భూమికి ప్రత్యేక ఐడీ



- రికార్డులు సరిగా లేక మోసాలు
- 'మీ భూమి-బ్లాక్ చెయిన్'తో అక్రమాలకు చెక్: సీఎం చంద్రబాబు
- ఏపీలో భూముల రక్షణకు సరికొత్త సాంకేతికత
- సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి
- ప్రతి ల్యాండ్ పార్సిల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ కేటాయింపు

**అమరావతి**

రాష్ట్రంలో భూముల రికార్డుల భద్రత కోసం కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అత్యాధునిక సాంకేతికతతో 'మీ భూమి - బ్లాక్ చెయిన్' వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పైలట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించారు. భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్లే విలువైన భూముల విషయంలో భారీగా మోసాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. సరికొత్త సాంకేతికతతో ఈ అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంతో పోల్చుకుంటే - మిగతా 3లో



## పేదలకు వరంగా తల్లికి వం'ధనం'


- పలువురి తల్లుల ఖాతాల్లో అర లక్షకుపైగా జమ
- పేదలకు వరంగా మారుతోన్న తల్లికి వందనం పథకం
- నిధుల జమపై లబ్ధిదారుల్లో సంతోషం
- అనంతపురం జిల్లాలో ఒకే కుటుంబంలో 6 మంది పిల్లలకు రూ.78 వేలు జమ

## హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్

- నియో-నాజీలకు యాత్రాస్థలంగా మారకుండా నిరోధించడమే లక్ష్యం
- 20 మిలియన్ యూరోల భారీ వ్యయంతో భవనం పునరుద్ధరణ
- ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందనలు, హక్కుల సంఘాల విమర్శలు
- చరిత్రను మరుగునపరిచే ప్రయత్నమంటూ పలువురి ఆరోపణ




## పారదర్శకంగా రాష్ట్ర లిటిగేషన్ పాలసీ అమలు



- గుజరాత్ తరహాలో ప్రత్యేక పోర్టల్
- పర్యవేక్షణకు మానిటరింగ్ సెల్ ఏర్పాటు
- ఏపీ లిటిగేషన్ పాలసీపై కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి మనోహర్

**అమరావతి**

పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన రాష్ట్ర లిటిగేషన్ పాలసీ అమలుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ గారు స్పష్టం చేశారు. శాఖల పరిధిలో కోర్టుల్లోకి కేసులను నిరంతర పర్యవేక్షణకు ఓ ప్రత్యేకమైన పద్ధతిని తీసుకురానున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లిటిగేషన్ పాలసీ పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సచివాలయంలో గురువారం సాయంత్రం జరిగింది. మంత్రులు ఎండీ ఫారుక్, సత్యకుమార్ లతో కలిసి మనోహర్ గారు పాల్గొని, పాలసీకి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా న్యాయ శాఖ - మిగతా 3లో



### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తగ్గేదేలే..

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గేది లేదన్న సీజేపీ
- తదుపరి చర్యలు నిరసన స్థలమైన జంతర్ మంతర్‌లోనే జరగాలని డిమాండ్
- కేంద్ర మంత్రి నడ్డాతో జరిగిన చర్చలు సమయం వృథా చేశాయని ఆరోపణ
- సోనమ్ వాంగ్‌చుక్ తన దీక్షను విరమించాలని సీజేపీ విజ్ఞప్తి
- ప్రధాన్ అసమర్థత వల్లే పేపర్ లీకులు జరుగుతున్నాయని విమర్శలు

## పుష్కరాల రోజు పోలవరం ప్రారంభోత్సవం!



- ఏ సమస్యైనా పరిష్కారమయ్యే వరకు ఇన్‌ఛార్జ్ మంత్రులదే బాధ్యత
- ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో పింఛన్ల పంపిణీ ఒకరోజు ముందే
- పింఛన్లు ఇచ్చేసి ప్రధాని పర్యటన కార్యక్రమంలో నిమగ్నం కావాలన్న సీఎం
- అజెండా అంశాలు ముగిశాక పలు అంశాలపై సుదీర్ఘ చర్చ

**అమరావతి**

రాష్ట్ర మంత్రివర్గం భేటీలో అజెండా అంశాలు ముగిశాక లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యవసాయ రంగం - జలవనరులు, పౌరసరఫరాలు, పరిశ్రమలు, పంచాయితీ రాజ్, ఆర్థిక శాఖలు సమన్వయంతో సంక్షోభాన్ని సవాలుగా తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. తాగు నీటికి తొలి ప్రాధాన్యం, పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు మంత్రులు వివరించాలన్నారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏ సమస్య ఎక్కడ తలెత్తినా ఇన్చార్జ్ మంత్రులు చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు ఇన్చార్జ్ మంత్రులదే బాధ్యత అని స్పష్టం చేశారు. భోగాపురం ప్రధాని పర్యటన వివరాలు మంత్రులకు సీఎం వివరించారు. ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో ఫించన్లు ఒకరోజు ముందే ఇచ్చేసి ఆగస్టు 1న పూర్తి స్థాయిలో ప్రధానమంత్రి కార్యక్రమంలో నిమగ్నం కావాలని చంద్రబాబు ఆదేశించారు. దేశ వ్యాప్తంగా ఉన్న - మిగతా 3లో

# హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్

జర్మన్ నియంత, లక్షలాది మంది మరణానికి కారణమైన అడాల్ఫ్ హిట్లర్ పుట్టిన ఇంటిని ఆస్ట్రియా ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌గా మార్చింది. నయా–నాజీలకు, తీవ్రవాద భావజాలం ఉన్నవారికి ఈ భవనం ఒక పుణ్యక్షేత్రంగా మారకుండా నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘకాలం పాటు కొనసాగిన వివాదాలకు ముగింపు పలుకుతూ, పునరుద్ధరించిన ఈ భవనాన్ని జూలై 22న అధికారికంగా ప్రారంభించారు. ఆస్ట్రియాలోని బ్రానో అమ్ ఇన్ పట్టణంలో, జర్మనీ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ ఇంట్లో హిట్లర్ 1889లో జన్మించాడు. అయితే, అతను ఇక్కడ కొద్ది కాలం మాత్రమే నివసించాడు. నాజీల పాలనలో ఈ భవనాన్ని ఒక స్మారక చిహ్నంగా, ఆర్ట్ మ్యూజియంగా మార్చారు. నాజీల పతనం తర్వాత, ఈ భవనం నయా–నాజీలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఏటా హిట్లర్ పుట్టినరోజున ఇక్కడికి వచ్చి నివాళులర్పించడం వివాదాలకు దారితీసింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం, ఆస్ట్రియా ప్రభుత్వం 2017లో ఈ భవనాన్ని చట్టపరంగా బలవంతంగా స్వాధీనం చేసుకుంది. అనంతరం, సుమారు 20 మిలియన్ యూరోలకు పైగా భారీ వ్యయంతో దీనిని పునరుద్ధరించి, పోలీస్ స్టేషన్‌గా మార్చింది. భవనం ముందు ఇప్పుడు కేవలం 'పోలీస్' అనే బోర్డు మాత్రమే కనిపిస్తుంది. హిట్లర్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. అయితే, భవనం బయట గతంలోనే ఏర్పాటు చేసిన 'మరోసారి ఫాసిజం వద్దు' అని రాసి ఉన్న స్మారక శిలను మాత్రం అలాగే ఉంచారు. ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక అధికారులు, ప్రజల నుంచి ఎక్కువగా మద్దతు లభిస్తోంది. దీనివల్ల ఈ ప్రాంతంలో వివాదాలు




సమసిపోతాయని, ప్రశాంతత నెలకొంటుందని వారు ఆశిస్తున్నారు. అయితే, ఈ నిర్ణయంపై విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. హోలోకాస్ట్ (యూదులపై సాగించిన దారుణ మారణహోమం) బాధితుల సంఘమైన 'మౌతాసెన్ కమిటీ' వంటి సంస్థలు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. చరిత్రను గుర్తుచేసుకుని, భవిష్యత్ తరాలకు దాని తీవ్రతను తెలియజేయడానికి బదులుగా, దానిని పూర్తిగా మరుగునపరిచే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు బదులుగా ఈ భవనాన్ని ఒక చారిత్రక మ్యూజియం లేదా విద్యా కేంద్రంగా మార్చి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్య ద్వారా, వివాదాస్పద చారిత్రక ప్రదేశాలను రోజువారీ వినియోగంలోకి తేవడం ద్వారా వాటి ప్రాధాన్యతను తగ్గించాలన్న ఆస్ట్రియా వ్యూహం స్పష్టమవుతోంది.

# జంతర్ మంతర్‌కు వేలాది మంది.. ఇది వాంగ్‌చుక్, దిప్కే వల్ల కాదు

**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న నిరసనలకు వేలాది మంది తరలివస్తున్నారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే నేతృత్వం వహిస్తుండగా, లడఖ్‌కు చెందిన పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టడంతో ఈ ఉద్యమానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం లభించింది. అయితే, ఇంతమంది జనం స్వచ్ఛందంగా తరలివస్తుండటానికి అసలు కారణం ఈ ఇద్దరు నేతల ఆకర్షణ మాత్రమే కాదని, 2026 నీట్ యూజీ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఆన్–స్క్రీన్ మార్కింగ్ అవకతవకల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పేరుకుపోయిన తీవ్ర ఆగ్రహమేనని క్షేత్రస్థాయి పరిశీలనలు చెబుతున్నాయి. పరీక్ష ఒత్తిడితో తోబుట్టువులను, స్నేహితులను కోల్పోయిన అనేకమంది యువకులు, పాఠశాల విద్యార్థులు సైతం తల్లిదండ్రులకు తెలియకుండా ఇక్కడికి చేరుకుంటున్నారు.

జంతర్ మంతర్‌కు ఇప్పుడు వేలాదిగా చేరుతున్న వారిని నడిపిస్తున్నది ఒక్క నాయకుడు కాదని విశ్లేషకులు చెబుతున్నారు. లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం తర్వాత విద్యార్థులు, యువతలో ఆగ్రహం మరింత పెరిగిందని అంటున్నారు. అదే దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఢిల్లీకి రావడానికి కారణమైందని పేర్కొంటున్నారు. అందుకే ఈ ఉద్యమం వ్యక్తుల చుట్టూ కాకుండా ప్రజల ఆవేదన చుట్టూ విస్తరిస్తోందని వివరిస్తున్నారు.

**ఇలా మొదలైంది**

సీజేపీ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏఐఎస్ఏ వంటి విద్యార్థి సంఘాలు 2026 జూన్ 6 నుంచి జంతర్ మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల



కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ఆపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జూన్ 28న వాంగ్‌చుక్ దీక్ష ప్రారంభించగా, జులై మధ్యలో బారికేడ్లు తొలగించి, ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం, దిప్కేపై సిరా దాడి ఘటన మీడియా దృష్టిని మరింత పెంచాయి.

జులై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజు 'సంసద్ చలో' పేరిట వేలాది మంది నిరసనకారులు పార్లమెంట్ వైపు కవాతు చేపట్టగా, భద్రతా బారికేడ్లను దాటే యత్నం చేయడంతో పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో నిరసనకారులు, పోలీసులు స్వల్పంగా గాయపడగా, 10–15 మందిని అదుపులోకి తీసుకున్నట్టు వర్గాలు తెలిపాయి. అయితే పోలీసులు ఎలాంటి బలప్రయోగం చేయలేదని అధికారులు తెలిపారు.

రాజకీయ పార్టీలు, ప్రతిపక్ష నేతలు ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఈ నిరసనలు పరీక్షల సమస్యలకు మించి రాజకీయ లక్ష్యాలతో సాగుతున్నాయని ఆరోపిస్తోంది. రానున్న రోజుల్లో ప్రభుత్వ స్పందన, వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి, మరిన్ని విద్యార్థి బృందాల భాగస్వామ్యంపైనే ఈ ఉద్యమ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**సామాన్యుల ఆగ్రహమే కారణం**

నీట్ పేపర్ లీక్, పరీక్షల అవకతవకల వల్ల జీవితాలు నాశనమైన సాధారణ విద్యార్థులు, కుటుంబాలే ఈ జనప్రవాహానికి నిజమైన కారణం. నాయకుల పిలుపు కంటే మించి, వ్యవస్థపై నమ్మకం కోల్పోయిన సామాన్యుల ఆగ్రహమే ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

# 'సిలిండర్‌పై రూ.700కుపైగా సబ్సిడీ!'

అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు భారీగా పెరిగినా, దేశీయ వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ, దేశంలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం దేశీయ ఎల్పీజీ సిలిండర్ రిటైల్ ధర రూ.942గా కొనసాగుతోందని తెలిపారు. అయితే జూన్ 2026లో ఒక్కో సిలిండర్‌పై రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ ఉందని వివరించారు. జూలై నెలలో కూడా ఒక్కో సిలిండర్‌పై రూ.500కు పైగా పరోక్ష సబ్సిడీ కొనసాగుతోందని చెప్పారు.

**అంతర్జాతీయ ధరలు పెరిగినా ధర నియంత్రణ**

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు ఒక్కసారిగా పెరిగాయని కేంద్రం తెలిపింది. ఎల్పీజీ ధరల నిర్ణయంలో కీలకమైన సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్ (సౌదీ సీపీ) ఏప్రిల్, మే నెలల్లో మెట్రిక్ టన్నుకు 780 డాలర్లకు చేరిందని జూన్‌లో 796 డాలర్లకు పెరిగిందని పేర్కొంది. ఆ అంతర్జాతీయ ధరల ప్రకారం దేశీయ మార్కెట్‌లో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1,695 వరకు చేరుకునే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది. అయితే వినియోగదారులపై ఆ భారం పడకుండా ప్రభుత్వం ధరలను నియంత్రిస్తోందని తెలిపింది.

**ఉజ్వల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం!**

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉన్న 10.5 కోట్ల మందికిపైగా వినియోగదారులకు మరింత ప్రయోజనం అందుతోందని కేంద్రం తెలిపింది. దిల్లీలో ఉజ్వల లబ్ధిదారులు ఒక్కో సిలిండర్‌కు కేవలం రూ.642 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొంది. ఇందులో కేంద్రం అందిస్తున్న రూ.300 లక్ష్యిత సబ్సిడీతో పాటు రూ.500కు పైగా పరోక్ష సబ్సిడీ కూడా ఉంటుందని వివరించింది. అంతర్జాతీయ ధరల ప్రభావం నేరుగా వినియోగదారులపై పడకుండా ప్రభుత్వం భరిస్తోందని తెలిపింది.

**సరఫరాలో అంతరాయం లేదు!**

పశ్చిమాసియాలో సంక్షోభం సమయంలో హోర్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాలు ఎల్పీజీ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో గతంలో దాదాపు 60 శాతం దిగుమతులపై ఆధారపడేదని పేర్కొంది. ఈ దిగుమతుల్లో దాదాపు 90 శాతం హర్మూజ్ జలసంధి మార్గం ద్వారా వచ్చేవని వివరించింది. అయితే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు దేశీయ ఉత్పత్తిని పెంచినట్లు తెలిపింది. రోజుకు 34 టీఎంటీగా ఉన్న దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 54 టీఎంటీకి పెంచినట్లు వెల్లడించింది. అంతేకాకుండా దిగుమతుల వనరులను విస్తరించడం, నిల్వలను సమర్థంగా నిర్వహించడం, ప్రాంతాల మధ్య సరఫరాలను సర్దుబాటు చేయడం వంటి చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. మార్చి నుంచి జూన్ 2026 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 56 కోట్లకు పైగా గృహ ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేశామని, అందులో 12 కోట్లకు పైగా ఉజ్వల కుటుంబాలకు అందించినట్లు కేంద్రం తెలిపింది.

**ఎల్పీజీ కోసం వేల కోట్ల భారం**

దేశీయ ఎల్పీజీ ధరలను నియంత్రించేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రభుత్వం భారీగా నిధులు అందిస్తోందని వెల్లడించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్లు చెల్లించగా.. 2025–26, 2026–27 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.30 వేల కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపింది. అయితే ప్రభుత్వ రంగ చమురు సంస్థలు దేశీయ ఎల్పీజీ విక్రయాల్లో ఎదుర్కొంటున్న నష్టాలు కూడా భారీగానే ఉన్నాయని పేర్కొంది. జూన్ 30, 2026 నాటికి ఈ నష్టాలు రూ.51 వేల కోట్లకు పైగా ఉన్నట్లు వివరించింది.

**పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై స్పష్టత లేదు**

మరోవైపు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తారా అనే ప్రశ్నకు కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు ఇంకా అస్థిరంగానే ఉన్నాయని తెలిపింది. బ్రెంట్ క్రూడ్ ధర ఏప్రిల్ 30న బ్యారెల్‌కు 122.86 డాలర్లుగా ఉండగా, జూలై 2న 68.17 డాలర్లకు తగ్గిందని కేంద్రం వెల్లడించింది. అయితే జూలై 21న మళ్లీ 92.19 డాలర్లకు పెరిగిందని తెలిపింది. భారత్ తన అవసరాల్లో 88 శాతానికి పైగా ముడిచమురును దిగుమతి చేసుకుంటుందని, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా మార్చి నుంచి అంతర్జాతీయ ధరలు పెరిగాయని కేంద్రం పేర్కొంది. వినియోగదారులపై భారం తగ్గించేందుకు మార్చి 2026లో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించినట్లు తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడిందని వివరించింది.

## డీఆర్‌డీఓ మరో ఘనత..

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (గా=–గాావీ) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (ఖాూఎ), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది.

'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్–శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్–400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్–8, ఎస్–400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తగ్గేదేలే




పరీక్షా పత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, ఈ డిమాండ్‌పై ఎలాంటి చర్చలకు, రాజీకి తావులేదని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరపాలనుకుంటే, నిరసన జరుగుతున్న జంతర్ మంతర్ వద్దకే రావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే మీడియాతో మాట్లాడారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు మా నిరసన కొనసాగుతుంది. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదు. అదే సమయంలో, సోనమ్ వాంగ్‌చుక్ గారు తన ప్రాణాలను పణంగా పెట్టడం మాకు ఇష్టం లేదు. దేశానికి ఆయన సేవలు ఎంతో అవసరం కాబట్టి, ఆయన తన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కోరుతున్నాం" అని డిప్కే విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ దీక్ష గురువారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. కేంద్ర మంత్రులతో చర్చల విషయంపై డిప్కే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "కేంద్ర మంత్రి జేపీ నడ్డా నివాసంలో చర్చల పేరుతో మమ్మల్ని ఐదు గంటల పాటు ఎదురుచూసేలా చేశారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఇది సమయాన్ని వృథా చేయడమే. ఒకవైపు మమ్మల్ని చర్చలకు పిలుస్తూనే, మరోవైపు విద్యార్థులపై దారుణంగా దాడులు చేయించారు. ఇకపై ప్రభుత్వం ఏమైనా మాట్లాడాలనుకుంటే, తదుపరి సమావేశం జంతర్ మంతర్‌లోనే జరగాలి" అని ఆయన అన్నారు. ఈ ఆందోళనను రాజకీయం చేస్తున్నారన్న నడ్డా వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "ఆయనకు రాజకీయాలు అంతగా నచ్చకపోతే, పదవి నుంచి తప్పుకోవచ్చు కదా? ఎన్నికల ర్యాలీలు, ఓట్లు అడిగేది వారు. మేము విద్యార్థులకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నాం" అని డిప్కే బదులిచ్చారు. సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ రంకా మాట్లాడుతూ.. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మా ప్రధాన డిమాండ్. దానిపై చర్చల్లేవు. వ్యవస్థలో పైనుంచి కింది వరకు అసమర్థులు, అవినీతిపరులు తిష్ట వేయడం వల్లే పేపర్ లీకులు జరుగుతున్నాయి. వీరందరి పైన ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించదు" అని తీవ్రంగా విమర్శించారు. ఈ ఉద్యమం తమ హక్కుల కోసం పోరాడేలా ఓ తరాన్ని ప్రేరేపించిందని, ఇదే తమ అతిపెద్ద విజయమని ఆయన పేర్కొన్నారు.

## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్–ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్–2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్–ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# పుష్కరాల రోజు పోలవరం ప్రారంభోత్సవం!

-మొదటిపేజీ తరువాయి

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈసారి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని మంత్రులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తాగునీటికి తీవ్ర సమస్య ఎదురు కావొచ్చన్నారు. క్లిష్ట పరిస్థితులపై రైతుల్ని చైతన్యపరచాల్సిన బాధ్యత మంత్రులందరిపైనా ఉందని అభిప్రాయపడ్డారు. కృష్ణా, గుంటూరు డెల్టాలో వరి సాగు వేయకుండా రైతుల్ని చైతన్య పరచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు పై రైతులకు అర్థమయేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వెల్లడించారు.



**ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ**

జిల్లాల్లో ఇన్చార్జ్ మంత్రి – కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారం అయినట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్ సమస్యల పరిష్కారం అయినవి ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలని సూచించారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. గంటల తరబడి నిలబడి ప్రతీ ఒక్కరికీ స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారని అన్నారు. అన్ని చోట్లా ఎమ్మెల్యేలు మంత్రులు ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. రెండేళ్ల విజయాలపై మంత్రులు ప్రెస్?మీట్?లు పెట్టి చేతులు దులుపుకున్నారని అన్నారు. విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అంశంలో వెనకపడ్డారన్నారు. పలాసలో రోడ్డు ప్రమాద ఘటన, టీటీడీ ఆంజనేయ స్వామి విగ్రహ చోరీ నిందితుల్ని సీసీ టీవీలు పట్టించిన తీరును సీఎం మంత్రులకు వివరించారు.

**అర్హులైన అందరికీ నేతన్న భరోసా**

నేతన్న భరోసాపై మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. అర్హులైన అందరికీ నేతన్న భరోసాను అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అనర్హులు నేతన్న భరోసా పొందినట్లు పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అర్హులకు నష్టం జరగకుండా, నిజమైన నేతన్నలకు మేలు చేసే విధంగా పథకం అమలు కావాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీకి, దిల్లీ ఆందోళనలకు ముడిపెట్టాలని వైఎస్సార్సీపీ యత్నిస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లేని వివాదాలు సృష్టించటమే ఆ పార్టీ నైజం అని చంద్రబాబు మండిపడ్డారు. అలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. ప్రో యాక్టివ్?గా మంత్రులు ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ఆగస్టు చివరి వారంలో ఉద్యాన హబ్‌ను మదనపల్లిలో ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆగస్టు మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ప్రారంభోత్సవం ఉంటే, చివర్లో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు. గోదావరి పుష్కరాల ప్రారంభ రోజునే పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర ఆశలకు రెక్కలు కల్పించామన్నారు. వెనుకబాటుతనం అనేది ఇక ఆ ప్రాంతంలో ఉండరాదని సీఎం స్పష్టం చేశారు. రెండో త్రైమాసికంలోకి అడుగు పెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని సీఎం సూచించారు. కేంద్రం నుంచి శాఖల వారీగా రావాల్సిన నిధులపై దృష్టి సారించాలన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మైలురాయి**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మైలురాయిగా నిలిచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్న వివరాలను సీఎం కేబినెట్‌కు వివరించారు. ఆగస్టు 1వ తేదీన జరిగే ఈ ప్రతిష్ఠాత్మక ప్రధానమంత్రి కార్యక్రమంలో మంత్రులు, అధికారులు పూర్తి స్థాయిలో నిమగ్నం కావాలని ఆదేశించారు. ఇందుకోసం ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల్లో లబ్ధిదారులకు ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. వెనుకబాటుతనం అనే మాటే లేకుండా ఉత్తరాంధ్ర ప్రజల ఆశలకు రెక్కలు కల్పించేలా ఈ కార్యక్రమం విజయవంతం కావాలన్నారు.

దేశంలో నదుల అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని, గంగా-కావేరి అనుసంధానంతో పాటు రాష్ట్రంలోని గోదావరి-బనకచర్ల నదుల అనుసంధానానికి దిల్లీ పెద్దల మద్దతు లభిస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేంద్రం నుంచి వివిధ శాఖలకు రావలసిన నిధులపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పొగాకు రైతుల సమస్యలపై కేబినెట్‌లో మూడు కీలక ప్రతిపాదనలు చర్చకు వచ్చాయని, రైతులకు రూ.60 వేల వడ్డీ లేని రుణం ఇచ్చే అంశం పరిశీలనలో ఉందన్నారు. పొగాకు బోర్డు నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇచ్చేలా, గ్రేడింగ్ మార్పులపై కేంద్ర అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.జ

# గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ–జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది.పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు.. లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదు అనే గుబులు జనసేన కిందిస్థాయి లీడర్లలో కనిపిస్తుంటే.. మెజారిటీ ఓటు బ్యాంకు మాదే, సీట్ల కేటాయింపులో సింహభాగం మాకే దక్కాలి అని తమ్ముళ్లు వాదిస్తున్నారు. ఈ పట్టువిడుపులు లేని ధోరణి ఉమ్మడి జిల్లాల అంతటా కూటమి సమన్వయాన్ని దెబ్బతీస్తోంది.అసెంబ్లీ సీట్ల సర్దుబాటు కంటే స్థానిక సంస్థల సీట్ల సర్దుబాటే చంద్రబాబు–పవన్ కళ్యాణ్‌లకు అసలైన పరీక్ష అని చెబుతున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే సీటు అనేది నియోజకవర్గానికి ఒక్కటే ఉంటుంది కాబట్టి నచ్చజెప్పడం సులువు. కానీ, వేలాదిగా ఉండే వార్డులు, వందలాదిగా ఉండే సర్పంచ్ స్థానాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సదరు లీడర్ రెబెల్‌గా మారే ప్రమాదం ఉంది లేదా పక్కనే పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. గోదావరి జిల్లాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా అది రాష్ట్ర వ్యాప్త కూటమి గ్రాఫ్‌పై ప్రభావం చూపిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే.. గోదావరి జిల్లాల గ్రామాల్లో తమ్ముళ్లు, సైనికుల మధ్య సాగుతున్న ఈ సీట్ల పంచాయితీని అధిష్ఠానం ఎంత త్వరగా సెటిల్ చేస్తే అంత మంచిది. పైస్థాయిలో ఉన్న దోస్తీ.. కిందిస్థాయి గడప దాకా చేరకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాల కోటల్లో అంతర్గత తిరుగుబాట్లు తప్పవు. మరి ఈ పొత్తుల రొంపి నుంచి ఇరు పార్టీల స్థానిక లీడర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎలా గట్టెక్కిస్తారో చూడాలి.



# 13 మంది మంత్రులకే డేంజర్ బెల్స్

**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే రెండేళ్లు పూర్తి చేసుకుంది. గత ఎన్నికల్లో ఎవ్వరూ ఊహించని విధంగా కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయిన వైఎస్సార్‌సీపీ అసలు ఇప్పట్లో పుంజుకుంటుందా ? ఆ పార్టీ కేడర్ రోడ్డెక్కుతారా ? అన్న సందేహాలు అందరిలోనూ కలిగాయి. కానీ ఆశ్చర్యంగా రెండేళ్లకే ఆ పార్టీ నాయకత్వం ఇస్తోన్న పిలుపునకు వైసీపీ కేడర్ ఉత్సాహంగా రోడ్లెక్కేస్తున్నారు. వైసీపీ ఇంత త్వరగా కోలుకుని మూడు పార్టీల కూటమి ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. దీనికి చాలా కారణాలు, తప్పులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం అయిపోయింది. ఎమ్మెల్యేలు ఎవ్వరూ ముఖ్యమంత్రి లేదా తమ పార్టీ అధినేతలు చెప్పినట్టు వినే పరిస్థితి లేదు. ఈ విషయంలో పరిస్థితి చేయిదాటిపోయింది. చంద్రబాబు గతానికి భిన్నంగా ఈ సారి తన కేబినెట్లో కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. వాళ్లలో ఎక్కువ మంది తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన వారు కూడా ఉన్నారు. వీళ్లు తమ శాఖల పరంగా పట్టు సాధించడంలోనూ , ఇటు పార్టీకి ఉపయోగపడడంలోనూ దారుణంగా విఫలమవుతున్నారు. తెలుగుదేశం నుంచి కేబినెట్ మంత్రులుగా ఉన్న వారిలో ఏకంగా 13 మంది కొత్తవాళ్లే ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇదే కేబినెట్‌తో చంద్రబాబు ఎన్నికలకు వెళితే ఖచ్చితంగా ఇబ్బందులు తప్పవని పార్టీలో సీనియర్ నాయకులు తమ అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు.శాఖలకు మంత్రులుగా ఎవరు ఉన్నా .. జిల్లాల పరంగా పవర్ ఫుల్ వ్యక్తులు లేకపోతే ఖచ్చితంగా అది ఎన్నికలపై, జిల్లా అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికలకు మరో మూడేళ్ల టైం కూడా లేదు.. అందుకే డైనమిక్‌గా ఉండేవాళ్లకే కేబినెట్లో చోటు కల్పించాల్సిన అవసరం ఉంది. కేబినెట్లో ఉన్న మంత్రుల్లో ఎక్కువ మంది మంత్రుల పనితీరుపై కూడా చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ ఎంతమాత్రం సంతృప్తిగా లేరని అంటున్నారు. దసరాకు కాస్త అటూ ఇటూగా కేబినెట్లో మార్పులు, చేర్పులు ఉండవచ్చని అంటున్నారు. ఫస్ట్ టైం ఛాన్స్ మిస్ అయ్యిన వారికి రెండో విడతలో ఖచ్చితంగా ఛాన్స్ ఇస్తారని అంటున్నారు.తొలిసారి కేబినెట్లో చోటు దక్కించుకున్న వాళ్లలో అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, సుభాష్, సవిత, టి జీ భరత్, బి సి జనార్దన్ రెడ్డి , నిమ్మల రామానాయుడు, గుమ్మడి సంధ్యా రాణి, డోలా బాల వీరాంజనేయ స్వామి ఉండగా.. వీరిలో సగానికి పైగా మంత్రుల పనితీరు అసలు ఏ మాత్రం బాగోలేదంటున్నారు. విచిత్రం ఏంటంటే సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నచోట కూడా ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఆర్థికశాఖలపై కూడా ప్రజల్లోనూ, ప్రభుత్వ వర్గాల్లో అంత సంతృప్తి లేదంటున్నారు ఇక అన్నింటింకి మించి కూటమి ప్రభుత్వంలో బిల్స్ వైసీపీ నేతలు చెప్పిన వాళ్లకు క్లీయర్ అవుతున్నాయన్నది బయటకు వచ్చేసింది. టీజీ భరత్ వివాద రహితుడే అయినా ఆయన శాఖ ఆయన చేతుల్లో లేదంటున్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ, పెట్టుబడి వచ్చినా అది లోకేష్ ఖాతాలోకి వెళ్లిపోతోంది. కొన్ని పరిశ్రమల ప్రారంభోత్సవానికి కూడా సంబంధిత శాఖా మంత్రికి ఆహ్వానం ఉండడం లేదని సచివాలయ వర్గాల్లో చెవులు కొరుక్కుంటున్నారు. ఏదేమైనా అటు మంత్రుల పట్ల, ఇటు ప్రభుత్వం పట్ల, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ప్రజలు అయితే సంతృప్తిగా లేకపోవడంతోనూ రెండేళ్లకే ఇంత వ్యతిరేకత కనపడుతోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## యండి పియస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**యండి పియస్ మాదిగ దళ పోరాట సమితి వ్యవస్థాపకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ గారి ఆదేశాల మేరకు**

**యండి పియస్ వీరబల్లి మండల అధ్యక్షుడు గురజాల నాగరాజ అధ్యక్షతన నూతన కమిటీని నిర్మాణం**



**వీరబల్లి జూలై 23 ప్రజా జ్యోతి** కడప జిల్లా వీరబల్లి మండలం గడికోట పంచాయతీ లో యండి పియస్ మాదిగ దళ పోరాట సమితి గడికోట గ్రామ అధ్యక్షుడు చెన్నూరు నాగరాజు, గ్రామ ఉపాధ్యక్షుడిగా వెంకటేశును ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వీరబల్లి మండల అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూపెద్దపల్లి శేఖర్ అన్న జాతి అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతూ ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమస్యను సాల్వ్ చేసే విధంగా ముందుకు పోతున్నారు.కావున గ్రామం మండల నియోజకవర్గ మారుమూల ప్రాంతాల్లో ఉన్నటువంటి జాతి యువకులు మహిళలు విద్యార్థులు ప్రతి ఒక్కరు కూడా పెద్దపల్లి శేఖర్ అన్న గారి అడుగుజాడల్లో నడుస్తుంది జాతి అభివృద్ధిలో భాగం కావాలని తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో వెంకటేష్, అంజి, చిరంజీవి, ఠాగూర్, నరేంద్ర, వంశీ, అంజి, రెడ్డయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు

## 155 వడ్ల సంచుల దొంగతనం కేసు ఛేదన.. ముగ్గురి అరెస్ట్

**నందవరం, జూలై 23(ప్రజా జ్యోతి ):** మండలంలోని నాగలదిన్నె గ్రామంలో జరిగిన 155 వడ్ల సంచుల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తిమ్మారెడ్డి తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం.. నాగలదిన్నె గ్రామ సచివాలయం వెనుక ఉన్న గోదాంలో రంగయ్య శెట్టికి చెందిన 155 వడ్ల సంచులు 2026 ఏప్రిల్ 15, జూన్ 6 తేదీల్లో దొంగిలించబడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, జూలై 23న నాగలదిన్నె గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, మన్సూర్, రంగస్వామిలను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 155 వడ్ల సంచులతో పాటు దొంగతనానికి ఉపయోగించిన ఒక ట్రాక్టర్, ఒక టెంపోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురినీ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

## పేదలకు వరంగా తల్లికి వం'ధనం'

కూటమి ప్రభుత్వం అందజేస్తున్న 'తల్లికి వందనం' లబ్ధి పేదలకు వరంగా మారుతోంది. అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లల చదువును ప్రోత్సహించేలా, బిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీంతో అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఏటా రూ. 15,000 కేటాయించగా, అందులో పాఠశాలల నిర్వహణ కోసం రూ. 2,000 మినహాయించి, మిగిలిన రూ. 13,000 నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. తాజాగా తల్లికి వందనం నిధుల జమపై లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. నలుగురు, ఐదుగురు పిల్లలున్న తల్లులు ఒకేసారి తమ ఖాతాల్లో అర లక్షకుపైగా జమయ్యాయంటూ సంబరపడుతున్నారు. ప్రధానంగా కూలిపనులకు వెళ్లే కుటుంబాలైతే ఒక్కసారిగా ఇంత మొత్తంలో డబ్బు చూడడం ఇదే మొదటిసారంటూ ఉద్వేగానికి లోనవుతున్నారు. కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందంటూ కృతజ్ఞతలు చెప్తున్నారు.

**ఒకే ఇంట్లో ఆరుగురికి తల్లికి వందనం**

అనంతపురం జిల్లా కుందుర్పికి చెందిన వడ్డే రాము, పద్మావతి దంపతులకు ఐదుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం. ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో ఆరుగురికీ కలిపి రూ.78 వేల నగదు జమ అయింది. పెద్ద అమ్మాయి పుష్పావతి ఇంటర్ ఫస్టియర్ కాగా, అఖిల, కవిత, వాణి, నవిక, పరమేశ్వర్ కుందుర్పి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తల్లిదండ్రులు రాళ్లు కొట్టే పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నగదు జమ కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు 'తల్లికి వందనం' నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కడపలోని ప్రధాన పోస్టాఫీస్ వద్ద విద్యార్థుల తల్లులు బారులు తీరారు. డబ్బులు తీసుకునేందుకు భారీగా తరలివచ్చిన మహిళలు గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. వారి కోసం కార్యాలయం వద్ద అధికారులు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి రోజుకు రూ.25 వేల చొప్పున నగదు ఇస్తున్నారు. లబ్ధిదారులు సమీపంలోని ఏ పోస్టాఫీస్‌లోనైనా డబ్బులు తీసుకోవచ్చని, నగదు పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

**ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి :**

తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ

ఒకటి నుంచి ఇంటర్ వరకు ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంత మందికీ వర్తింపు

ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

తల్లికి వందనం కోసం రూ.10,120.78 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.

ఈనెల 24 వరకు తల్లుల ఖాతాల్లో నిధుల జమ

తల్లికి వందనం పథకానికి అర్హతలు ఇవే :

ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు

రేషన్ కార్డు కలిగి ఉండాలి

గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలకు మించి ఆదాయం ఉండకూడదు

టాక్సీ, ట్రాక్టర్, ఆటోలు మినహా ఇతర ఫోర్ వీలర్ వెహికల్ కలిగి ఉండకూడదు

ఇంటి విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి ఉండకూడదు

పట్టణాల్లో 1,000 చదరపు అడుగులకు మించి స్థలం ఉండకూడదు

ప్రభుత్వ ఉద్యోగులు, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించేవారు అనర్హులు

డబ్బులు అందకపోతే ఏం చేయాలి?

మీ గ్రామ, వార్డు పరిధిలోని సచివాలయాన్ని సంప్రదించాలి

గ్రీవెన్సులో ఫిర్యాదులు చేసి సమస్యను పరిష్కరించుకోవాలి

డబ్బులు పడనివారికి గ్రీవెన్సులో ఫిర్యాదు చేసే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది

గ్రామ, వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలి

మీ సమస్యను విని గ్రీవెన్స్ నమోదు చేస్తారు

నిర్ణీత తేదీలోగా సచివాలయంలో గ్రీవెన్స్ నమోదు చేయాలి

## ప్రతి భూమికి ప్రత్యేక ఐడీ

-మొదటిపేజీ తరువాయి

ఏపీలో భూ వివాదాలు (ల్యాండ్ లిటిగేషన్లు) తక్కువేనని ముఖ్యమంత్రి అన్నారు. కానీ, గత ప్రభుత్వ విధానాల వల్ల ఏపీలోనూ భూ తగాదాలు, వివాదాలు బాగా పెరిగాయని మండిపడ్డారు. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు ప్రారంభించిన 'మీ భూమి–బ్లాక్ చైన్' వ్యవస్థ ద్వారా రైతుల భూములకు భవిష్యత్తులో శాశ్వత భద్రత దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు.

**టాంపర్ ప్రూఫ్ వ్యవస్థగా**

భూ రికార్డులకు సంబంధించి టాంపర్ ప్రూఫ్ (రికార్డులు మార్చడానికి వీల్లేని) వ్యవస్థను ప్రభుత్వం తెస్తోంది.

# తల్లికి వందనం రెండో విడత నిధుల జమ.. రెట్టింపు ఆనందంలో తల్లిదండ్రులు

**సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజ**
**సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా తీసుకెళ్తున్న ప్రభుత్వం**
**బొల్లా పుల్లయ్య, కణితి మధు**



ఎటపాక టీడీపీ మండల అధ్యక్షులు **బొల్లా పుల్లయ్య**



ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి **కణితి మధు**

**ఎటపాక, జూలై 23 (ప్రజాజ్యోతి):** కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన 'తల్లికి వందనం' పథకం ద్వారా రెండో విడత ఆర్థిక సాయం ఈ నెల 22, 23, 24 తేదీలలో అర్హులైన తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందని ఎటపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు తెలిపారు. వారు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, ఒకటో తరగతి నుంచి ఇంటర్ (12వ తరగతి) వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి ఏడాది రూ.10,091 కోట్లతో 67,27,164 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని, రెండో ఏడాదిలో రూ.10,128.78 కోట్ల నిధులను విడుదల చేసి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. సంక్షేమం ఒకవైపు, అభివృద్ధి మరోవైపు అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తోందని వారు అన్నారు. విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా గుర్తింపు పొందుతోందని బొల్లా పుల్లయ్య, కణితి మధు తెలిపారు.

## టీడీపీ నాయకుడికి ఘన నివాళి అర్పించిన ఎమ్మెల్యే అమిలినేని, టిడిపి నాయకులు



**కంబదూరు జూలై 23:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల పరిధిలోని రాళ్లనంతపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు దివంగత పోలినేని వెంకటేషులు, వైకుంఠ సమారాధన కార్యక్రమానికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేషులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దివంగత నేత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామస్తులు ఎమ్మెల్యే సురేంద్రబాబుకు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ విపక్ష నేత కరణం రామ్మోహన్ చౌదరి, మారుతి కాన్వెంట్ సురేంద్ర, కామన్న, మండల, గ్రామస్థాయి టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని వెంకటేషులు సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.

## సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

**ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు సుధాకర్ పిలుపు**



**హొళగుంద,జూలై 23, ప్రజా జ్యోతి న్యూస్** - ఈ నెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆస్పరి మండల పర్యటనను అత్యంత ఘనంగా, విజయవంతం చేయాలని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు, ఎమ్.డి.హళ్లి మాజీ సర్పంచ్ గుమ్మారాళ్ల సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని హొళగుందా మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సభా ప్రాంగణానికి కార్యకర్తలు, నాయకులు సమయానికి చేరుకుని ఈ పర్యటనను జయప్రదం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# సీఎం పర్యటనలో ఎటపాక ముంపు బాధితులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి

**పరిహారం--పునరావాసంపై ప్రకటన చేయాలి**
**లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తాం**
**సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కందుకూరి స్వర్ణ**



సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కందుకూరి స్వర్ణ

**ఎటపాక, జూలై 23 (ప్రజాజ్యోతి):** ముఖ్యమంత్రి పోలవరం జిల్లా పర్యటన సందర్భంగా ఎటపాక మండలంలోని ముంపు గ్రామాలు, భూముల బాధితులకు వచ్చే పుష్కరాల లోగా పూర్తి పరిహారం, పునరావాసం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కందుకూరి స్వర్ణ డిమాండ్ చేశారు. ఏడు మండలాల విభజనలో అత్యధికంగా నష్టపోయిన ఎటపాక మండలంలోని నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు పరిహారం అందకపోవడం దురదృష్టకరమని ఆమె విమర్శించారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎటపాక మండలాన్ని ముంపు ప్రాంతంగా గుర్తించి పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని, ఒకవేళ ముంపు ప్రాంతంగా పరిగణించకపోతే తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో ముంపు బాధితుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలవరం ప్రభావిత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కందుకూరి స్వర్ణ కోరారు.

## నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.

**జులై 24న విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ**



**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి జులై 23** దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చలగాట మాడిన నీట్ పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జులై 24న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ చేయాలని బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద విలేఖల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ మాట్లాడుతూనీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలో దేశ విద్య వ్యవస్థ పై విద్యార్థులలో తీవ్ర ఆందోళనను కలిగించాయని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నీట్ పరీక్షల అవకతవకలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 24న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ ను విద్యాసంస్థల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమి రెడ్డిపల్లి అరవింద్, ఉపాధ్యక్షులు సంగటి దేవకుమార్, నాయకులు సిద్దు లు పాల్గొన్నారు.

## తాగునీరు, వీధి దీపాల సమస్యలకు తక్షణ పరిష్కారం.. శ్రావణి సేవలు ఆదర్శం

**ప్రజాసేవలో ముందున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణి**




**ప్రజా జ్యోతి మైలవరం** మైలవరం మండలం వద్దిరాల గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శి శ్రావణి ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి చురుకుగా స్పందిస్తున్నారని వారు తెలిపారు. సచివాలయం పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య, వీధి దీపాల మరమ్మతులు, పారిశుద్ధ్య సమస్యలు లేదా ఇతర మౌలిక వసతులకు సంబంధించిన ఇబ్బందులు తలెత్తినప్పుడు గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకెళ్లగానే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి కొన్ని గంటల్లోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ నిధులతో మాత్రమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో తన సొంత ఖర్చుతో కూడా సహాయం అందిస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్నారని గ్రామ ప్రజలు కొనియాడారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేస్తున్న శ్రావణి వంటి అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నారని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణి సేవలు ఇలాగే కొనసాగాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

# ఎండీఎంఎల్ యాప్‌పై అవగాహన కార్యక్రమం






**డోన్ ( ప్రజా జ్యోతి) జూలై 23,** నంద్యాల జిల్లాడోన్ మున్సిపాలిటీలో ఎండీఎంఎల్ యాప్,మన డబ్బులు.మన లెక్కలు,అనే అంశంపై విస్తృత అవగాహన కార్యక్రమం, డోన్ టౌన్ లోర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఎండీఎంఎల్(వీణమీా) యాప్ వినియోగం, ఆర్థిక లావాదేవీల పారదర్శకత, పొదుపు వివరాల నిర్వహణ, రుణాల సమాచారం, ఖాతాల పర్యవేక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ, ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఎండీఎంఎల్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, దీనివల్ల సంఘాల ఆర్థిక లావాదేవీలు మరింత పారదర్శకంగా ఉండటంతో పాటు సభ్యులు తమ ఖాతాల వివరాలను ఎప్పటికప్పుడు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డోన్ మెప్మా జూ సువర్ణ,ఐజూా జావీద్ ఐ=ా రామయ్య సంబంధిత సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ద్వారా ప్రజలకు ఎండీఎంఎల్ యాప్ ప్రాముఖ్యతను వివరించి, ప్రతి సభ్యురాలు యాప్‌ను వినియోగించి ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు అని తెలిపారు.

## జాతీయ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ఘన విజయం




**ఎటపాక, జూలై 23 (ప్రజాజ్యోతి):** మహారాష్ట్ర రాష్ట్రంలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరుగుతున్న జాతీయ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో మాస్టర్స్ క్రీడాకారులు విజేతలుగా నిలవడంతో క్లాసిక్ విభాగంలో తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మక ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. ఈ ఘన విజయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు అందించిన పతకాలే ప్రధాన బలమని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ రామిరెడ్డి తెలిపారు. పోటీల్లో డి.వి. శంకరరావు క్లాసిక్, ఎక్విప్డ్ విభాగాల్లో కలిపి 8 రజత పతకాలు, ఎండి. అబ్బాస్ కూడా 8 రజత పతకాలు సాధించారు. మల్లేష్ క్లాసిక్ విభాగంలో 4 స్వర్ణ పతకాలు గెలిచి సత్తా చాటగా, శేషు ఎక్విప్డ్ విభాగంలో ఒక కాంస్య పతకం సాధించారు. కరుణాకుమార్ జాతీయ స్థాయిలో తొమ్మిదో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణకు లభించిన ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారుల పాత్ర విశేషమని జీవీ రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, ట్రెజరర్ మహంతి వెంకటకృష్ణాజీ, జాయింట్ సెక్రటరీ శోభన్ నాయక్, పట్టణ ప్రముఖులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, సిటీ స్టైల్ జిమ్ సభ్యులు ఘనంగా అభినందించారు.

# ముఖ్యమంత్రి పర్యటనలో పోలవరం నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి

**: సీపీఎం కూనవరం మండల కార్యదర్శి**



**కూనవరం, జూలై 23:** ప్రజా జ్యోతి ఈ నెల 24న రంపచోడవరం పర్యటనకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు భూ ప్యాకేజీ, పునరావాసం భూమికి భూమి అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం కూనవరం మండల కార్యదర్శి డిమాండ్ చేశారు. పోలవరం ప్రభావిత పెద్దార్కూరు, కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగులపాడు గ్రామ పంచాయతీలతో పాటు మండలంలోని మొత్తం 44 ముంపు గ్రామాలకు భూ ప్యాకేజీ, ఆర్అండ్ఆర్ ప్రయోజనాలు తక్షణమే అందించాలని కోరారు. ప్రాధాన్యత గ్రామాలుగా గుర్తించిన తొమ్మిది గ్రామాల్లో పునరావాసం, భూమికి భూమి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా పది గ్రామాలకు "41.5 కాంటూర్ పరిధిలో లేవు" అనే కారణంతో పరిహారం నిరాకరించడం అన్యాయమని విమర్శించారు. వాస్తవానికి వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలు ముంపు ప్రభావానికి గురవుతున్నప్పటికీ తప్పుడు లెక్కలతో గిరిజనులకు రావాల్సిన హక్కులు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది గోదావరి వరదల సమయంలో కూనవరం మండలంలోని 22 గ్రామాలు విద్యుత్ అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఆర్అండ్‌బి రహదారిపై సర్వే పూర్తయినా పనులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రంపచోడవరం పర్యటన సందర్భంగా పోలవరం నిర్వాసితుల భూ ప్యాకేజీ, పునరావాసం, ఆర్అండ్ఆర్ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఎం కూనవరం మండలం తరఫున డిమాండ్ చేశారు.

## మహిళలు నిర్భయంగా ముందుకు సాగాలి

: సీఐ కులాయప్ప

మహిళల భద్రత, సాధికారతపై అవగాహన సదస్సు



**ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో సుంకులమ్మ ఆలయం సమీపంలో మహిళల భద్రత, సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల రక్షణకు ప్రభుత్వం, పోలీసు శాఖ చేపడుతున్న చర్యలు, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ కులాయప్ప మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించా లని సూచించారు. మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని వివరించారు. ఎస్ఐ హైమవతి మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటన లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు శ్రీవాణి, డాక్టర్ సావిత్, డాక్టర్ ప్రణీత్ కుమార్ మహిళల ఆరోగ్యం, విద్య, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. మహిళలు విద్య, ఉపాధి, ఆరోగ్య విషయాల్లో ముందుండాలని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొని అధికారులు తెలిపిన సూచనలను ఆసక్తిగా ఆలకించారు. మహిళల భద్రత, సాధికారత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని గ్రామస్థులు కోరారు.

## మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ని కలిసిన పంచాయతీ రాజ్ డీఈ, వైడబ్ల్యూసీఎస్ కార్యదర్శి



**ఎమ్మిగనూరు జులై 23(ప్రజా జ్యోతి ):** ఇటీవల బదిలీపై ఎమ్మిగనూరు ప్రాంతానికి వచ్చిన పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజనీర్ డిఇ చంద్రమౌళి,"ఔజూ కార్యదర్శి వెంకటేశులు ఎమ్మిగనూరులోని ఆర్‌డబీ అతిథి గృహంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిద్దరికీ హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేస్తూ, తమ నూతన బాధ్యతల్లో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలందిస్తూ, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరియు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణను తక్షణమే రద్దు చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే.గిరి డిమాండ్

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రైటర్లకు వైసీపీ మద్దతు



**హోళగుంద, జూలై 23, ప్రజా జ్యోతి న్యూస్ –** రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న డాక్యుమెంట్ రైటర్ల పొట్ట కొట్టేలా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రైవేటీకరించడం తీవ్ర అన్యాయమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే. గిరి విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని డాక్యుమెంట్ రైటర్లకు మద్దతుగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఎస్.కే. గిరి మాట్లాడుతూ ముఖ్యమైన అంశాలను వెల్లడించారు.కూటమి ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా, సొంతంగా ఉపాధి పొందుతున్న డాక్యుమెంట్ రైటర్ల బతుకుతెరువును ప్రైవేటీకరణ పేరుతో దెబ్బతీస్తోందని మండిపడ్డారు.రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు ప్రత్యేక ఆఫీసులు ఏర్పాటు చేసుకుంటారని తెలిపారు. దీనివల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు: ప్రైవేట్ కేంద్రాల్లో డాక్యుమెంట్ చెకింగ్ కోసం ?5,000 చలానా చెల్లించాల్సి వస్తుంది.ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ఆఫీసులో మార్కెట్ వ్యాల్యూ ప్రకారం సాధారణ చలానా కట్టాలి. ఈ విధంగా కష్టమర్లపై రెండు రకాల చలానాల భారం పడుతుందని స్పష్టం చేశారు. ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు మేల్కోవాలి: 'సంపద సృష్టి' పేరుతో సామాన్య ప్రజల నుంచి, వినియోగదారుల నుంచి రెండు చలానాల రూపంలో డబ్బులు గుంజడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ప్రజలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జున, ప్రముఖ నాయకులు మల్లప్ప, రాముడు, ఏరన్న తదితరులు పాల్గొని డాక్యుమెంట్ రైటర్లకు తమ పూర్తి మద్దతు తెలిపారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు

--ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

--సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్రమం

--బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులకు ఎంపీపీ సూచనలు





**కాకినాడ జిల్లా జూలై 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో అర్బన్,రూరల్ మండలాల పరిధిలో బాల్య వివాహాల నిరోధక చట్టాలు,బాలల రక్షణ చట్టాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఐసిడిఎస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా యుక్తవయస్సులో గర్భధారణలు (టీనేజ్ ప్రెగ్నెన్సీ),బాల్య వివాహాల నివారణ అంశాలపై మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు.బాల్య వివాహాలను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు,శాఖల మధ్య సమన్వయం,గ్రామ స్థాయిలో పర్యవేక్షణ,అనుమానాస్పద బాల్య వివాహాలను వెంటనే గుర్తించి నివారించే విధానాలు,సంబంధిత చట్టాల అమలు,ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం,పోక్సో చట్టం తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.బాలల రక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని,బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె కీర్తి,మండల అభివృద్ధి అధికారి రామరాజు వర్మ,వైద్యులు సౌమ్య, నాగలక్ష్మి,అడ్వకేట్ అవసరాల దేవి,నాయకులు అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపి,పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు,పసల సూరిబాబు,కొప్పుల బాబ్జి,ఎంఈఓ అబ్బాయి,నగర పంచాయతీ కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు,అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వనిర్ణయం మార్చుకోవాలి!..

మేము కోరుకున్న ప్రాంతంలోనే నివాస పునరావాసం కల్పించాలి!..

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు మరోసారి తెరపైకి!..

నిర్వాసితులు,పునరావాసప్రాంతఎంపికపై తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆందోళన!..







**వి.ఆర్.పురం,జులై23(ప్రజాజ్యోతి ప్రతినిధి)** మండలం వడ్డు గూడెం పంచాయతీ పరిధిలోని,వరరామచంద్రాపురం, గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితులు పునరావాసం విషయంలో తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ నిరసనకుది గారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలపరిసర ప్రాంతాల్లో తమకు పునరావాసం కల్పించాలనే ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేశారు. ఆప్రాంతం నివాస యోగ్యంగా లేదని, జీవించడానికి ఆదాయ మార్గాలు లేవని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఉపాధి అవకాశాలు కూడా లేవని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. తాముఅక్కడ నివసించేందుకు ఆసక్తి లేదని,ఎన్ని సార్లు అధికారులకు తెలిపినా,ప్రభుత్వం తమ అభిప్రాయాన్ని పట్టించుకోకుండా బలవంతంగా అక్కడికి పంపించే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరువూరు ప్రాంతాన్ని పరిశీలించేందుకు తీసుకెళ్లేముందు స్థానిక అధికారులు, తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారని అనంతరం ఆసంతకాలనే గ్రామ తీర్మానంగాచూపిస్తూ తిరువూరు ప్రాంతాన్ని అంగీకరించినట్లుగా నమోదుచేశారని నిర్వాసితులు ఆరోపించారు .తిరువూరు ప్రాంతం తమకు అనుకూలంగా లేదనిస్పష్టంగాచెప్పినా,తమ అభిప్రాయాన్ని పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని,ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తాగునీరు, ఉపాధి, విద్య,వైద్యం వంటి మౌలిక సదుపాయాలు ఉన్న ప్రాంతంలో పునరావాసం కల్పించి తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సురక్షిత బ్యాంకింగ్ సేవల వినియోగంపై అవగాహన కల్పించిన షామా షబ్బీన్ ఆశ

డ్వాక్రా మహిళలకు డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన..




**శంఖవరం జులై 23 (ప్రజా జ్యోతి న్యూస్)** సురక్షిత డిజిటల్ బ్యాంకింగ్ సేవలే ఆర్థిక భద్రతకు మార్గం అని ఆర్బీఐ అసిస్టెంట్ మేనేజర్స్ ఆశ మరియు షాన షబ్బీన్ తెలిపారు.జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామంలోని వెలుగు కార్యాలయంలో కాకినాడ జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సి.హెచ్.ఎల్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఎలక్ట్రాని క్ బ్యాంకింగ్ అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ మహిళలు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకోవడంతో పాటు ఆర్థిక లావాదేవీలను స్వయంగా నిర్వహించేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్లు షామా షబ్బీన్ , ఆశ మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీల ప్రాధాన్యత, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం సేవల వినియోగంపై మహిళలకు సమగ్రంగా వివరించారు. బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ సేవలు, వినియోగదారుల హక్కులు, బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించుకునే విధానాన్ని వివరించారు.అలాగే సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించ వద్దని, డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కాకినాడ జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సి.హెచ్.ఎల్.వి. ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు కూడా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, ఆర్థిక స్వావలంబనకు డిజిటల్ లావాదేవీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ లింకేజ్ డిపిఎం అశోక్ భరత్, సీసీ బాబురావు, ఏపీఎం కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు ఆసక్తిగా శిక్షణ పొందడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## రైతులకు వెంటనే విత్తనాలు అందించాలి

-- జడ్పీటీసీ గుజ్జ విజయ డిమాండ్

రైతులకు ఇప్పటికీ విత్తనాలు అందలేదు

-- ఆన్‌లైన్ విధానంతో ప్రభుత్వం నిరాశపరుస్తోంది:

**కూనవరం జులై 23, ప్రజా జ్యోతి** ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లో అనేక మంది రైతులకు విత్తనాలు అందడం లేదని, ఆన్‌లైన్ విధానం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని జడ్పీటీసీ సభ్యురాలు గుజ్జ విజయ ఆరోపించారు. వెబ్‌ల్యాండ్ లో నమోదు ఉన్న రైతులకు మాత్రమే విత్తనాలు ఇవ్వడం అన్యాయమని, గతంలో పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగా రైతులకు విత్తనాలు అందించేవారని గుర్తు చేశారు.వ్యవసాయానికి ఇప్పటికే సకాలంలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో విత్తనాల పంపిణీలో ఆంక్షలు విధించడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని ఆమె విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను ప్రభుత్వం వెంటనే సవరించి, అర్హులైన ప్రతి రైతుకు విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత పరిస్థితి కొనసాగితే సంబంధిత మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, ప్రతి రైతుకు రూ.1 లక్ష నష్టపరిహారం అందించాలని ఆమె కోరారు. రైతే దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి అర్హ రైతుకు ఎలాంటి వివక్ష లేకుండా విత్తనాలు అందించాలని ప్రభుత్వాన్ని జడ్పీటీసీ గుజ్జ విజయ కోరారు.



# తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది!..

**అధైర్య చెందకు!..**

**మాజీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బురకా కన్నారావు!..**



**వి.ఆర్.పురం,జులై23(ప్రజాజ్యోతి ప్రతినిధి)**అధైర్య చెందకు తెలుగుదేశం పార్టీ మీకు అండగా ఉంటుందని, తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి బురకా కన్నారావు, స్పష్టం చేశారు. గురువారం,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర రామచంద్రాపురం మండలం రామవరం పంచాయతీ చొప్పల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయిన బూడిద దుర్గ,కు బుధవారం,హఠాత్తుగా గుండెలో తీవ్రంగానొప్పి రావడంతో వెంటనే బయలుదేరి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలో మోహనరావు,హాస్పటల్ లో వైద్యం అందించారని వివరించారు.తరువాత అక్కడ డాక్టర్ దుర్గకు,గుండె పై,ఉన్న గడ్డను ఎమర్జెన్సీ ఆపరేషన్ ద్వారా వెంటనే తొలిగించారని చెప్పారు.ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలిసివెంటనే పరామర్శించామని వివరించారు.మాజీ ఆర్గనైజషన్ కార్యదర్శి బురక సారయ్య, బోదేబోయిన సురేష్ రావు, సరియం కుమారి,చొప్పల్లి గ్రామంలో వెళ్లి ఆమెఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకోని, నువ్వు ధైర్యంగాఉండాలి నీకు మేము ఉన్నాము తెలుగు దేశం పార్టీ నీకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుంది అని ధైర్యం చెప్పడం జరిగిందని వివరించారు.ఈపరామర్శించిన వారిలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నెరడి బ్యారేజీ నిర్మాణానికి రూ.641 కోట్లు మంజూరు



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం ప్రజల చిరకాల స్వప్నం సాకారం దిశగా చారిత్రాత్మక అడుగు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాతపట్నం నియోజకవర్గ రైతాంగం, ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నెరడి బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ రూ.641 కోట్ల నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అని పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు గారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలోని వెనుకబడిన, కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చే అత్యంత కీలక ప్రాజెక్టుగా నెరడి బ్యారేజీ నిలుస్తుందన్నారు. వంశధార ప్రాజెక్టు రెండో దశలో భాగంగా ఈ బ్యారేజీ నిర్మాణం ద్వారా జిల్లాలో వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు, ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందన్నారు నెరడి బ్యారేజీ నిర్మాణంలో గతంలో ఏర్పడిన న్యాయపరమైన, అంతర్రాష్ట్ర వివాదాలను అధిగమించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందని ఎమ్మెల్యే తెలిపారు.అప్పటి జిల్లా మంత్రిగా, ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర వాదనలను సమర్థవంతంగా వినిపించేం దుకు చేసిన కృషి ఫలితంగానే 2017లో వంశధార జల వివాదాల ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింద న్నారు.2024లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నా యుడు నాయక త్వంలో, కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో కేంద్ర ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి తీసుకురావడంతో, 2026 మార్చి 30న ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో ప్రకటించడం రాష్ట్రానికి గొప్ప విజయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్ రూ.641 కోట్ల నిధులు మంజూరు చేయడం ద్వారా నెరడి బ్యారేజీ నిర్మాణానికి మార్గం పూర్తిగా సుగమమైందని, రాష్ట్ర మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు రెండేళ్లలోనే నెరడి బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ పాతపట్నం ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఎమ్మెల్యే గారు తెలిపారు.. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి, రాష్ట్ర విద్య మరియు ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ బాబు గారికి,రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కి, కేంద్ర మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కి పాతపట్నం నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు..నెరడి బ్యారేజీ పూర్తయితే పాతపట్నం నియోజకవర్గంతో పాటు శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభించి, రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే గారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రైవేట్ ఎరువుల దుకాణాల డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**మండల వ్యవసాయాధికారి ఆనంద్ లోక్ దళ్**

**హోళగుంద అగ్రి డీలర్లతో సమీక్షా సమావేశం**



**హోళగుంద, జూలై 23, ప్రజా జ్యోతి న్యూస్ –** రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు మరియు పురుగుమందులను నిర్దేశిత ధరలకే అందించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ మరియు విత్తన డీలర్లతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన డీలర్లకు పలు కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు.

**ముఖ్యమైన ఆదేశాలు,నిబంధనలు**

**ఎం ఆర్ పి ధరలకే యూరియా**

రైతులకు సరిపడా యూరియా, డి ఎ పి నిల్వలను ముందస్తుగా తెప్పించుకోవాలనీ,యూరియాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎం ఆర్ పి ధర కంటే ఎక్కువకు అమ్మరాదని ఆదేశించారు.

**ఎ పి ఎ ఐ ఎం ఎస్ – 2.0 యాప్ ద్వారానే**

**విక్రయాలు**

ఎరువుల విక్రయాలన్నీ తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ యాప్ (ఎ పి ఎ ఐ ఎం ఎస్ – 2.0) ద్వారానే నిర్వహించాలన్నారు.

**రైతులకు సులభతరం -- ఆధార్ ఉంటే చాలు**

ఎరువుల విక్రయానికి రైతుల నుండి కేవలం ఆధార్ కార్డు లేదా ఆధార్ సంఖ్య మాత్రమే అడగాలనీ,పొలం పాస్‌బుక్కులు అడగాల్సిన అవసరం లేదన్నారు.

నమోదు తప్పనిసరి ప్రతి రోజు విక్రయించిన ఎరువుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ఎ పి ఎ ఐ ఎం ఎస్ – 2.0 మరియు కేంద్ర ప్రభుత్వ డి బి టి యాప్‌లలో అదే రోజు నమోదు చేయాలని ఆదేశించారు.

**రసీదు మరియు సంతకం:**

రైతుకు ప్రతీ కొనుగోలుపై ఖచ్చితంగా బిల్లు ఇవ్వాలి. ఆ బిల్లుపై రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలి.

**ధరల పట్టిక, స్టాక్ నిర్వహణ:**


షాపుల్లో ప్రతిరోజూ ధరల పట్టిక, స్టాక్ పట్టికలు మరియు రికార్డులను అప్‌డేట్ చేయాలి.నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగుల మందులు లేదా బయోస్ అమ్మినట్లు తేలితే సంబంధిత డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**నెలవారీ నివేదికలు**

ప్రతి డీలర్ తమ నెలవారీ సేల్స్ రిపోర్టులను ప్రతి నెల 5వ తేదీ నాటికి ఎ ఓ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి, అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని టీడీపీ నాయకుడు హెచ్.ఎన్. రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు

**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: జూలై 23:** శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:హిందూపురం ఎమ్మెల్యే ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ఇటీవల సినిమా షూటింగ్ సందర్భంగా స్వల్పంగా గాయపడిన నేపథ్యంలో ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ హెచ్.ఎన్. రాము పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చనలు అభిషేకాలు నిర్వహించి హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ ఆయురారోగ్యాలు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి ఆయన ఆరోగ్యం దీర్ఘాయుష్షు కోసం మొక్కులు చెల్లించారు ఈ సందర్భంగా హెచ్.ఎన్. రాము మాట్లాడుతూ ప్రజల అభిమానాన్ని అపారంగా సంపాదించుకున్న నాయకుడు హిందూపురం ఎమ్మెల్యే ప్రజాప్రతినిధి నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని అన్నారు వైద్యుల సూచనలను పాటిస్తూ విశ్రాంతి తీసుకుంటున్న బాలకృష్ణ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి బాలకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలందిస్తున్న నాయకుడికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు దేవుని కృపతో ఆయన త్వరలోనే కోలుకుని ప్రజా సేవలు యథావిధిగా కొనసాగించాలని ఆకాంక్షించారు.శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల ముందుకు రావాలని కోరుతూ నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో హెచ్.ఎన్. రాము ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భగవంతుని అనుగ్రహంతో శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారని తెదేపా నాయకులు హెచ్ ఎన్ రాము తెలియజేశారు




## ఆర్డీఓ డివిజన్ అధికారి కె. అరుణ దేవి ని కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి



**ఎమ్మిగనూరు, జులై 23 (ప్రజా జ్యోతి ):** పట్టణంలోని ఆర్‌డబీ అతిథి గృహంలో ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి నూతన బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో కి శుభాకాంక్షలు తెలియజేసి, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలు, భూ వివాదాల పరిష్కారం, ప్రజలకు వేగవంతమైన సేవల అందజేత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందిస్తూ, రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడంలో పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల తహసీల్దార్లు (వీ=ాలు), స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## బార్లపూడి క్రాంతిని పరామర్శించిన డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

**--ముద్రగడ సేవలు చిరస్మరణీయం**

**-- రాజమండ్రిలో ముద్రగడ చిత్రపటానికి నివాళులు..**



**తూర్పుగోదావరి జిల్లా జూలై 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** మాజీ మంత్రి,కాపు ఉద్యమనేత కీర్తిశేషులు ముద్రగడ పద్మనాభం మృతి పట్ల కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి నివాసానికి వెళ్లిన తుమ్మల రామస్వామి (బాబు) ఆమెను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.అనంతరం ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కాపు వర్గ హక్కుల సాధనతో పాటు సమాజ అభ్యున్నతికి ముద్రగడ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలు మున్సిపాలిటీ నూతన క మిషనర్‌గా దివిజ సంపతి బాధ్యతల స్వీకారం





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు, జూలై 23: (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పురపాలక సంఘానికి నూతన కమిషనర్‌గా నియమితులైన దివిజ సంపతి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన మాజీ కమిషనర్ పి. శ్రీనివాసులు నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు.నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దివిజ సంపతికి కార్యాలయ మేనేజర్ సర్వేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.డి. ఆలీషా, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జె.ఎన్.సి.హెచ్. నీలిమ దీప్తితో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ వార్డు సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమెకు అభినందనలు తెలియజేశారు.

**సమన్వయంతో పనిచేయాలి: కమిషనర్ పిలుపు**

ఈ సందర్భంగా కమిషనర్ దివిజ సంపతి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతి అధికారి, వార్డు సచివాలయ ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అందరూ సమన్వయంతో పనిచేసి గొల్లప్రోలు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నిలపాలని పిలుపునిచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపుతామని ఆమె పేర్కొన్నారు.

**సిబ్బందిలో కొత్త ఉత్సాహం**

దివిజ సంపతి నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల పురపాలక సంఘ సిబ్బంది, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె నాయకత్వంలో గొల్లప్రోలు పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత లభిస్తుందని అధికారులు, ఉద్యోగులు ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

## 'తల్లికివందనంతో పేద కుటుంబాలకు అండ!.. ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి,విద్యాశాఖ మంత్రికి కృతజ్ఞతలు!..



**వి.ఆర్.పురం,జులై23(ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం,ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న,తల్లికి వందనం' పథకం ద్వారాతమకుటుంబానికి ఎంతో ఆసరా లభించిందని,వరరామచంద్రాపురం,మండలం,వడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బీ.సీ కాలనీకి చెందిన మోదుగు ఆదిలక్ష్మి, (భర్త వెంకన్నబాబు)సంతోషం వ్యక్తం చేశారు.?ఒకే కుటుంబంలో ఉన్న ముగ్గురుపిల్లలు మోదుగు అభినయశ్రీ,మోదుగు అనన్యశ్రీ, మోదుగు అవ్యాన్ వైదిక్,ల చదువుల నిమిత్తం ప్రభుత్వం మొత్తం 39,000/వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమచేసిందని ఆనందం వ్యక్తం చేశారు.? ఈ సందర్భంగా లబ్ధిదారు ఆదిలక్ష్మి మాట్లాడుతూ,ఒకే ఇంట్లో ఉన్నఎంతమంది పిల్లలకైనా,తల్లికి వందనం,వర్తింపజేస్తామని ఇచ్చిన మాట ప్రకారం,మా ముగ్గురు పిల్లలకు రూ. 39,000/- వేల రూపాయలు లబ్ధి చేకూర్చడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.ఈపథకం ద్వారా పేదవిద్యార్థుల చదువులకుఎంతో ఊరట లభిస్తుంది" అని తెలిపారు.మాకుటుంబానికి ఇంతటి గొప్ప సహాయం అందించినందుకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కి ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్,కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు,కి? లబ్ధిదారు కుటుంబ సభ్యులు మరియు స్థానికులు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఐఐటీలో సీటు సాధించిన పూర్వ విద్యార్థి సురేంద్రకు అభినందనలు

-అధినేత సుంకర వీరబాబు

--ఒమ్మంగి శ్రీ భారతి విద్యానికేతన్ పూర్వ విద్యార్థి ఘనత



**కాకినాడ జిల్లా జూలై 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలోని శ్రీ భారతి విద్యానికేతన్ పూర్వ విద్యార్థి దేవరపు సురేంద్ర చెన్నైలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఐఐటీ కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా శ్రీ భారతి విద్యాసంస్థల అధినేత,కరస్పాండెంట్ సుంకర వీరబాబు అభినందనలు తెలిపారు.విద్యార్థి సురేంద్ర కృషి,పట్టుదలతో ఉన్నత లక్ష్యాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.శ్రీ భారతి విద్యానికేతన్‌లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని కరస్పాండెంట్ సుంకర వీరబాబు పేర్కొన్నారు.

## 24న ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు , ఏఐఎస్బి ఏపీ ఎస్ ఎఫ్ ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

నీట్ ప్రశ్నపత్రం లీకేజ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.

పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకతను కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలి.

దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల భద్రతను బలోపేతం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

విద్యార్థుల భవిష్యత్తు కోసం న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం జూలై 24 రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేద్దాం!



**రాయచోటి జూలై 23 ప్రజా జ్యోతి** నీట్ పేపర్ లీకేజ్ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు ఏఐఎస్బి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ కోరారు.ఈ సందర్భంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజ్ ఘటన లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందనీ సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధ్యతారాహిత్యమైనదాని వారు అన్నారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాల్సిన జాతీయ స్థాయి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం తినిందని ఇలాంటి తీవ్రమైన వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలనీ అలాగే ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పూర్తి స్థాయి నిష్పాక్షిక విచారణ నిర్వహించి బాధ్యులందరినీ చట్టపరంగా శిక్షించాలనీ వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతో ఈ నెల 24వ తేదీన ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు లోకేష్ పిడిఎస్యు ఏ ఐ వై ఎఫ్ ఏపీ ఎస్ ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# బీరైతులో కానికి అండగా ఉంటాం

## ఎమ్మిగనూరు మార్కెట్ యార్డును ఆధునీకరిస్తాం: ఎమ్మెల్యే డా. బి.వి





**ఎమ్మిగనూరు, జులై 23(ప్రజా జ్యోతి ):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తీసుకువచ్చిన పంట తడిసి నష్టపోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధిత రైతులకు సాధ్యమైన అన్ని విధాలుగా సహాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మౌలిక వసతుల లోపం వల్ల ఒక్క రైతు కూడా నష్టపోకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మార్కెట్ యార్డులో తలెత్తిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ ఆధునిక సౌకర్యాలతో యార్డును అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ పాలనపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు గుప్పించారు. మార్కెట్ యార్డులో డ్రైనేజీ సమస్య ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని రైతులే చెబుతున్నారని, 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు.

ఆ ఐదేళ్లలో మార్కెట్ యార్డుకు ఎంత నిధులు కేటాయించారో, ఎన్ని గోదాములు నిర్మించారో, డ్రైనేజీ అభివృద్ధికి ఏ పనులు చేపట్టారో ప్రజలకు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే డా. బి.వి. మోహన్ రెడ్డి హయాంలోనే ఈ మార్కెట్ యార్డు ఏర్పాటు జరిగిందని తెలిపారు. ఈ ఘటనకు ముందుగానే కూటమి ప్రభుత్వం మార్కెట్ యార్డు ఆధునికీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసిందని, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంతో పాటు గోదాముల అభివృద్ధికి రూ.32 లక్షలు, తాగునీటి వసతులకు రూ.10 లక్షలు, విద్యుద్దీకరణ పనులకు రూ.10 లక్షలు, సీసీటీవీ నిఘా వ్యవస్థ ఏర్పాటుకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని వివరించారు.వ్యవసాయ రంగ అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొంటూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎమ్మిగనూరు మార్కెట్ యార్డును జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఇ-నామ్) ప్లాట్‌ఫారంతో అనుసంధానం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని 218 మార్కెట్ యార్డుల్లో కేవలం 33 యార్డులకు మాత్రమే ఈ అవకాశం దక్కగా, అందులో ఎమ్మిగనూరు ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు.ఆదోని--ఎమ్మిగనూరు మధ్య ఇంటర్-మార్కెట్ ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ద్వారా రూ.3.44 కోట్ల విలువైన వ్యాపారం జరిగి, రైతులకు నేరుగా డిజిటల్ చెల్లింపులు అందించిన విషయాన్ని గుర్తుచేశారు.భవిష్యత్తులో శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, అత్యాధునిక గోదాములు, సురక్షిత నిల్వ సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించి ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డును రాయలసీమలోనే ఆదర్శ రైతు-కేంద్రక మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఢ పార్టీ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కురువ మల్లయ్య,డైరెక్టర్లు, సెక్రటరీ కల్పన,మండల అధ్యక్షులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రవికుమార్ పై కఠిన చర్యలు తీసుకోవాలి.కాట్రేనికోన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెల్లి సురేష్





**కాట్రేనికోన ప్రజాజ్యోతి** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మీడియా సమావేశం ఈ సమావేశం లో ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబు పై అనుచ్చిత వ్యాఖ్యలు చేసిన చీకురుమెల్లి రవికుమార్ పై కాట్రేనికోన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ఎస్సీ సెల్ అధ్యక్షులు మండిపడ్డారు ముమ్మిడివరం అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బుచ్చిబాబుపై వ్యాఖ్యలు చేసే అంత పెద్దమనిషి వా నీకు దమ్ము ధైర్యం ఉంటే చర్చలకు రావాలని కుటుంబాన్ని పట్టించుకోని నీవు తండ్రిని పట్టించుకోని నీవు ఎమ్మెల్యే పై వ్యాఖ్యలు చేయడం సరికాదని పద్ధతి మార్చుకోవాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెల్లి సురేష్ ధ్వజమెత్తారు. కాట్రేనికోన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు బదుగు పుల్లారావు మాట్లాడుతూచీకురుమెల్లి రవికుమార్ మాల జాతికి మచ్చ తెచ్చే విధంగా మాట్లాడుతున్నారని మతిభ్రమించి ఎవరితో ఏమి మాట్లాడలో తెలియడం లేదని ఇకపై ముమ్మిడివరం శాసనసభ్యులు పై వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఇలాంటి వ్యాఖ్యలు మరలా చేస్తే రవికుమార్ పై చర్యలు తీసుకునే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని మీడియాకు తెలిపారు. కాట్రేనికోన మండల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు సువర్ణ జ్యోతి మాట్లాడుతూ చీకరుమల్లి రవికుమార్ ముందుగా తన కుటుంబాన్ని చక్కదిదుకోవాలని భార్య పిల్లలను గాలికి వదిలేసి ప్రతి ఒక్కరిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని రవికుమార్ ఇల్లు చక్కబెట్టుకుని ఆపై ఇతరులపై వ్యాఖ్యలు చేయాలని ఇకపై రవికుమార్ ముమ్మిడివరం శాసనసభ్యులపై అణచిత వ్యాఖ్యలు చేస్తే కాట్రేనికోన మండల మహిళలందరూ తనకు బుద్ధి చెబుతామని మండలంలో తిరిగితే అతనిని అడ్డుకుంటామని మీడియాతో తెలిపారు మీడియా అనంతరం చీపురుపల్లి రవికుమార్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## అసంఘటిత కార్మికులకు ప్రత్యేక సంక్షేమ చట్టం చేయాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్



**గుంతకల్లు జులై 23 (ప్రజా జ్యోతి):** అసంఘటిత కార్మికులకు ప్రత్యేక సంక్షేమ చట్టం చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు 26,000 కనీస వేతనం ఇవ్వాలని, కార్మిక, ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం పట్టణంలోని బీటి పకీరప్ప భవన్ నందు సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఏఐటియుసి 15 మహాసభలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ గౌడ్ మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తు దేశంలో లేబర్ కోడ్లను అమలుచేయడాన్ని వ్యతిరేకిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయ డం కార్మిక ద్రోహమన్నారు, రాష్ట్రంలో అసంఘటిత కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలు రూపొం దించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు, సమస్యలు పరిష్కరించ కుంటే మలిదశ ఉద్యమా నికి సిద్ధమవుతామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు మహేష్,మండల అధ్యక్షులు ఈశ్వరయ్య, కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు నరసయ్య, మల్లయ్య, గురుస్వామి, సుధాకర్, రామాంజనే యులు, చితంబరి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకుకృషి చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. బి. శంకరయ్యకు జిల్లా అధికారులచే ప్రశంస





**గుంతకల్లు జూలై 23 (ప్రజా జ్యోతి):** అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయం నందు గుంతకల్లు పట్టణ ట్రాఫిక్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న టువంటి ఆర్బి శంకరయ్య ను అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ గుంతకల్లు డి.ఎస్.పి శ్రీనివాస్ ఘనంగా సత్కరించి ఉత్తమ సేవ పత్రాన్ని అందజేయ డం జరిగింది. గుంతకల్లు పట్టణంలో ఎప్పుడు రోడ్లపై వాహనాలు రద్దీగా ఉండి గమ్యస్థానాలు చేరుకోవడా నికి అంతరాయం ఏర్పడు తూ ప్రజల తీవ్ర ఇబ్బందు లు గురవుతుంటారు కానీ బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.బి. శంకరయ్య దుమ్ము ధూళి గాలి వాన ఎండ వంటివి లెక్కచేయకుండా ట్రాఫిక్ లో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించి సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు దగ్గరవుతూ ప్రజల మన్ననలు పొందు తూ అధికారుల నుండి ఉత్తమ ట్రాఫిక్ కానిస్టేబుల్ గా ప్రశంసా పత్రాన్ని అందు కోవడం వల్ల పట్టణంలో పలువురు ఆయన్ని ఘనం గా సత్కరించారు. భవిష్య త్తులో మరిన్ని ఇలాంటి అవార్డులందుకోవాలని సూచించడం జరిగింది. ఎక్కడ రాజీ పడకుండా డ్యూటీ నే ద్యేయంగా ప్రజలకు సేవ చేస్తానని ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. బి.శంకరయ్య పేర్కొనడం జరిగింది.

## గొల్లప్రోలులో బాల్యవివాహాల నిర్మూలన, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు, జూలై 23: (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం (నంబర్ 169) నందు గురువారం 'పోషణ్ భీ పఢాయ్ భీ' కార్యక్రమంలో భాగంగా మహిళలకు, తల్లులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి మోకా శ్రీకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలన, మహిళా చట్టాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఎం. శ్రీకళ మాట్లాడుతూ, సమాజంలో బాల్యవివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ చట్టాల గురించి, అలాగే గర్భిణీ స్త్రీల ఆర్థిక, ఆరోగ్య భద్రత కోసం అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' పథకం యొక్క ప్రాధాన్యతను, దానికి అర్హతలను తల్లులకు వివరించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి దైనందిన జీవితంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలని ఆమె సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ కె. మానస దేవి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త, వార్డు పరిధిలోని తల్లులు, గర్భిణీలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పారాస్పోర్ట్స్‌లో దివ్యాంగ విద్యార్థి రెడ్డి భరద్వాజ ప్రతిభ

మూడు పతకాల తో కాకినాడ రూరల్‌కు కీర్తి



**కాకినాడ రూరల్ (ప్రజాజ్యోతి)** కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థి రెడ్డి భరద్వాజ రాష్ట్రస్థాయి పారాస్పోర్ట్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి పలు పతకాలు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. భవిత సెంటర్, జడ్పీ హైస్కూల్ (తిమ్మాపురం)లో పదో తరగతి చదువుతున్న భరద్వాజ, సమగ్ర శిక్ష -- పీఎంశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారాస్పోర్ట్స్ పోటీల్లో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాలు సాధించాడు. అలాగే షాట్‌పుట్ విభాగంలో ఒక రజత పతకం, 4ఐ100 మీటర్ల రిలే పోటీలో ఒక కాంస్య పతకం గెలుచుకుని విశేష ప్రతిభ చాటాడు. విద్యార్థి విజయంపై కాకినాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి--1 పి.ఎస్. ఈశ్వర శాస్త్రి, మండల విద్యాశాఖాధికారి--2 బి. శ్రీనివాస్ కుమార్ అభినందనలు తెలిపారు. క్రమశిక్షణతో సాధన చేస్తే మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ జయలక్ష్మి, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు వై.వి. లక్ష్మి, సీహెచ్. వీర గణేష్ తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## మన వరరామచంద్రాపురం పరిధిలో మౌలిక సదుపాయాలే లక్ష్యంగా!..

మండల ప్రజా పరిషత్,స్పెషల్ అధికారి ఏ.పి.డి.వో,ఇమ్మానుయేలు!.

ఎం.పి.పి.కారం లక్ష్మి!..

సమావేశంలో చర్చించిన ప్రధాన అంశాలు:





**వి.ఆర్.పురం,జులై23(ప్రజాజ్యోతి ప్రతినిధి)**వరరామచంద్రాపురం, మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై,ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసంచర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. (1:-గ్రామపంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలుమరియు అవసరాల పై సమీక్ష

(2:-పారిశుద్ధ్య కార్యక్రమాలుబి - వీధుల శుభ్రత

(3:-వీధి దీపాలు, రిపేర్లు మరియు కొత్త లైట్ల ఏర్పాటు

(4:-బ్లీచింగ్ మరియు ఫాగింగ్, దోమల నివారణ.

(5:-చేతి పంపులు రిపేరు,త్రాగునీటి సమస్యల పరిష్కారం కోసం.

ఇరువురు సంయుక్తంగా ఇచ్చిన ఆదేశాలు ప్రతి పంచాయతీలో పైనతెలిపిన పనులను ఎలాంటిజాప్యం లేకుండా, సవ్యంగా,త్వరితగతిన పూర్తి చేయవలసిందిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులను, అధికారులను ఆదేశించడం జరిగినది. ఈసమావేశంలో మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సేవా ధార్మిక్ అవార్డుకు ఎంపికయిన విశ్వమానవవేదిక

**పాలకొల్లు, ప్రజాజ్యోతి జులై 23.** పాలకొల్లు, వేడంగి పరిసర గ్రామాలకు సామాజిక సేవ, అనాథ వయోవృద్ధుల సంక్షేమం, నిత్యాన్నదాన రంగంలో విశేష సేవలందిస్తున్న "విశ్వమానవ వేదిక" సంస్థకు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి గౌరవం దక్కింది. సుదీర్ఘకాలంగా సమాజానికి అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తిస్తూ, ప్రముఖ స్వచ్ఛంద సంస్థ "లతా రాజా ఫౌండేషన్" వారి 22వ జాతీయ సేవా ధార్మిక్ అవార్డుకు విశ్వమానవవేదిక ఎంపికైందని విశ్వమానవ వేదిక సంస్థ అధ్యక్షులు మల్లుల సురేష్ గురువారం తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఇచ్చే ఈ జాతీయ పురస్కారాల్లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్తమ సంస్థలను లతా రాజా ఫౌండేషన్ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ కె.కె. రాజా, ట్రస్టీ డాక్టర్ ఎన్. సిద్ధోజి రావులు ఎంపిక చేశారని మల్లుల సురేష్ అన్నారు. జాతీయ పురస్కారాలకు ఎంపికైన సంస్థలలో ఆంధ్రప్రదేశ్ నుండి విశ్వమానవ వేదిక తెలంగాణ నుండి దేవ్ నార్ బ్లైండ్ ఫౌండేషన్ ఉత్తర భారతదేశంనుండి ముస్కాన్ సంస్థాన్ ( రాజస్థాన్) దక్షిణ భారతదేశం నుండి కేర్ షెల్టర్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్ ( కర్ణాటక) ఉన్నాయి. ఈ సేవా సంస్థలకు పురస్కార ప్రదానోత్సవం ఈ నెల 25న తెలంగాణ రాష్ట్రం, ఖమ్మంలోని ఈనాడు ఆఫీస్ ఎదురుగా గల యస్ ఆర్ గార్డెన్స్ వేదికపైన ఘనంగా జరగనుంది. ఈ అవార్డు కింద సంస్థకు ఒక లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసా పత్రం తో పాటు ప్రత్యేక జ్ఞాపికను అందజేయనున్నారు. అనాథలు, ఆదరణ లేని వయోవృద్ధులకు ఆశ్రయం కల్పించడం, క్యారేజీలతో ఉచిత నిత్యాన్నదానం అందించడం, ఉచిత వైద్య, దంత వైద్య శిబిరాలు నిర్వహించడం, ఉచిత అంతిమ సంస్కారాల సేవలు అందిస్తున్నందుకు గాను ఈ జాతీయ పురస్కారం దక్కిందని మల్లుల సురేష్ తెలిపారు. ఈ లతా రాజా ఫౌండేషన్‌కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు ఐ ఎ యస్, సి. ఆంజనేయ రెడ్డి ఐ పి యస్ , కె.వి. రమణాచారి ఐ ఎ యస్, సి. పార్థసారథి ఐ ఎ యస్, పి.ఎస్. ఎన్. మూర్తి ఐ డి ఎ యస్, గంధం చంద్రుడు ఐ ఎ యస్, వంటి సీనియర్ అధికారులు, పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి (శాంతా బయోటెక్), అశ్విని సుబ్బారావు (అశ్విని హోమియో ఫార్మసీ), లింగ హరీష్ గాంధీ (లింగా గ్రూప్), వి. స్లీవా రెడ్డి (విప్రా వెంచర్స్), శ్రీ గుమ్మి రామిరెడ్డి (గ్రూప్), వి. శ్రీనివాసరావు (వాసు) వంటి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మార్గదర్శకులుగా, సభ్యులుగా వ్యవహరిస్తున్నారని వివరాలకు మల్లుల సురేష్ తెలిపారు.




# ఆర్టీసీని ప్రైవేటీకరణ దిశగా నెట్టే కుట్రలను విరమించుకోవాలి

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే చేపట్టాలి

ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలి

ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ నిరసన




**మదనపల్లి జూలై 23 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ పట్ల అవలంబిస్తున్న విధానాలు ఉద్యోగులు, కార్మిక సంఘాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలకు చౌకగా, సురక్షితంగా రవాణా సేవలు అందించే ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో దశలవారీగా ప్రైవేటీకరణ వైపు నడిపించే ప్రయత్నాలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు జనార్దన్ కోరారు. ఏఐటియుసి రాష్ట్ర సమితి పిలుపు మేరకు మదనపల్లి ఆర్టీసీ 2డిపో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్లను వాణిజ్య కేంద్రాలుగా మార్చడం, విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు, ఇతర సేవల్లో ప్రైవేట్ జోక్యాన్ని పెంచడం వంటి చర్యలు ప్రభుత్వ రంగ సంస్థ స్వరూపాన్ని బలహీనపరచే ప్రమాదం ఉంది. ఆర్టీసీని లాభనష్టాల కోణంలో కాకుండా ప్రజా సేవా సంస్థగా ప్రభుత్వం చూడాలని కోరారు. ఆర్టీసీని బలోపేతం చేయాలంటే ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కొత్త బస్సులను కొనుగోలు చేయాలి. గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని సర్వీసులు నడపాలి. ఉద్యోగుల హక్కులను, ఉద్యోగ భద్రతను కాపాడాలి. ప్రైవేటీకరణకు దారితీసే అన్ని చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రజల ఆస్తి. ప్రజల ఆస్తిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఏ ప్రయత్నాన్నైనా ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. అవసరమైతే ఇతర కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవా, ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గజపతి, సిద్ధార్థ్, రవి, చిన్నికృష్ణ,రమణ,రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

## నాయుడువలస గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు రోగులకు మందులు పంపిణీ




**అనంతగిరి మండలం. జులై 23.అల్లూరి సీతారామరాజు జిల్లా.** అనంతగిరి మండలం. ఎన్.ఆర్. పురం పంచాయతీ పరిధిలోని నాయుడువలస గ్రామంలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భీమవరం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిఅనూప్ ఆదేశాల మేరకు నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో మొత్తం 56.మంది గ్రామస్తులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం, జ్వరం, సీజనల్ వ్యాధుల లక్షణాలు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో జ్వరం, విరేచనాలు, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిశుభ్రత పాటించాలని, తాగునీటిని మరిగించి తాగాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇంటి వద్దనే ఆరోగ్య సేవలు అందుతున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంబాబు, ఎం.ఎల్.హెచ్.పీ రాము, ఏ.ఎన్.ఎంలు గంగభవాని, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది కోరారు.

## గొల్లప్రోలు నూతన మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు

పట్టణ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: టౌన్ ఇంచార్జ్ మామిడాల సూరిబాబు

పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపిన జనసేన శ్రేణులు



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పురపాలక సంఘం నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివిజ సంపతిని గొల్లప్రోలు టౌన్ జనసేన పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఆమెను కలిసిన నాయకులు.. నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు టౌన్ జనసేన పార్టీ ఇంచార్జ్ మామిడాల సూరిబాబు మాట్లాడుతూ.. గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలో ఎదురవుతున్న పలు ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి తమ జనసేన పార్టీ తరపున మున్సిపల్ యంత్రాంగానికి, అధికారులకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని ఆయన కమిషనర్‌కు స్పష్టం చేశారు.

### అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలి

నూతన కమిషనర్ దివిజ సంపతి సారథ్యంలో గొల్లప్రోలు పట్టణం అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలని, ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని ఆశిస్తున్నట్లు సూరిబాబు ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపించగలమని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. జనసేన నాయకుల అభినందనలపై నూతన కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. పట్టణ శ్రేయస్సు కోసం అందరి సహకారంతో ముందుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు టౌన్ ఇంచార్జ్ మామిడాల సూరిబాబు, జనసేన నాయకులు నెమల రమేష్,మొగలి రాజా, పేకేటి సుబ్రహ్మణ్యం పిలక బాబురావు, పేకేటి నాగేంద్ర ప్రసాద్, కర్రెడ్ల సత్తిబాబు, బలిరెడ్డి నానిబాబు,అరపి శ్రీను, రెడ్డి వీరస్వామి మరియు జనసేన నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు..

## దోమ కాటుతో ప్రమాదం.. అప్రమత్తతే రక్షణ



**బేతంచర్ల:జూలై 23,(ప్రజా జ్యోతి)**వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాజు సూచించారు. బేతంచెర్ల గొరుమానకొండ సమీపన మహాత్మా జ్యోతిబా పూలే బాలుర విద్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఇళ్లలోనూ, పరిసరాల్లోనూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటిస్తూ నీటి నిల్వ తొట్లను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రంగా కడిగి, ఆరబెట్టి తిరిగి తాజా నీటిని నింపుకోవాలని సూచించారు. ఇంటి లోపల, బయట నీరు నిలిచే ప్రదేశాలను తప్పనిసరిగా పరిశీలించి దోమల లార్వా పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులకు దోమల నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సహాయకులు రామాంజనేయులు, సుభాష్‌బాబు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



**డోన్:జూలై 23,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంపై క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జ్‌లు, పట్టణ, మండల అధ్యక్షులకు ప్రత్యేక అవగాహన, శిక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలు, వార్డులు, బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ పనితీరును తెలియజేయడం ద్వారా ప్రజాభిమానాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో కార్యక్రమ నిర్వహణ, ప్రచార విధానం, ఇంటింటి ప్రచారం, ప్రజలతో సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనార్టీ ఉర్దూ మీడియం స్కూల్ ను ప్రారంభించిన : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు జులై 23 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని ఎస్ జె పి స్కూల్ నందు వెనుక ల ఉన్న మైనార్టీ ఉర్దూ మీడియం స్కూల్ ను గురువారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి ప్రారంభించారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వారి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామిని ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులు వారికి ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీ సోదర సోదరీమణులు నన్ను ఒకే ఒక విషయం అడిగారు మా ముస్లిం మైనార్టీ పిల్లలకు ఉర్దూ మీడియం జూనియర్ కళాశాల కావాలని అడగడంతో స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకొని 50 లక్షల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించి ఈరోజు స్కూల్ ప్రారంభించామన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులు మాట్లాడుతూ మేము గత వైసిపి ప్రభుత్వంలో చాలా సార్లు విన్నవించిన పట్టించుకోలేదని, మా ముస్లిం పిల్లలకు ఉర్దూ మీడియం స్కూల్ కావాలని అడిగిన వెంటనే స్పందించి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి తెలపడంతో స్పందించి వెంటనే 50 లక్షల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించి మా ముస్లిం పిల్లలకు చాలా మంచి అవకాశం కల్పించా రని తెలియజేశారు. అలాగే జరగబోయే స్థానిక సంస్థ ఎలక్షన్లలో మా ముస్లిం సోదరులందరూ కూటమి ప్రభుత్వానికి మరియు గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటామని ఈ సభ ముఖంగా తెలుపుతున్నామనారు. ఈ కార్యక్ర మంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ కృష్ణారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గుణ, మైనార్టీ నాయకులు గుజిరి మహమ్మద్ ఖాజా, తలారి మస్తానప్ప, బండారు ఆనంద్ మరియు ముస్లిం సోదర సోదరీమణులు గుంతకల్లు టిడిపి పట్టణం మరియు మండల నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు హాజరు కావడం జరిగింది.

# సామాజిక కార్యకర్త సోనామ్ వాంగ్ చుక్ అరెస్టును ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నిరసన




**గుంతకల్లు జులై 23 (ప్రజా జ్యోతి):** సామాజిక కార్యకర్త సోనామ్ వాంగ్ చుక్ అరెస్టును ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప కులు మాన్యశ్రీ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర స్థానిక ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి వై. భీమ లింగ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం వై. భీమ లింగ మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ కావడం తో ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త సోనామ్ వాంగ్ చుక్ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత 25 రోజులుగా జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. అయితే ఈ దీక్షను పోలీసులు భగ్నం చేస్తూ సోనామ్ వాంగు చుక్ ను హాస్పిటల్ కి తరలించా రు. విషయం తెలుసుకున్న కాక్రోచ్ పార్టీ ఆధ్వర్యంలో లక్షలాదిమంది విద్యార్థులు మరియు యువకులు జంతర్ మంతర్ వద్దకు చేరుకొని నీట్ పరీక్ష పత్రాలు లీక్ కావడానికి ప్రధాన కారణం ధర్మేంద్ర ప్రధాన్ నే అని అతను వెంటనే రాజీనామా చేయాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నటువంటి విద్యార్థుల పైన పోలీసులు లాఠి ఛార్జ మరియు భాష్పా వాయువు ఉపయోగించారు పోలీసులు లాఠి ఛార్జ్ చేయడం వలన విద్యార్థుల కు రక్త గాయాలు కావడం చాలా బాధాకరం ఇప్పటికైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవ తీసుకొని విద్యా శాఖ మంత్రి చేత రాజీనామా చేయించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని దశలవారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు బి. సంపత్, మురళి, పకీరప్ప రమేష్, రామంజి, మోహన్, శేఖర్, ఓబులేసు, లక్ష్మీనారాయణ మల్లన్న గోవిందు, ప్రతాప్, సుధాకర్, వినోద్, నాగభూషణం, మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# పసిమొగ్గలపై రాక్షసత్వం!

పాఠశాలనా... చిత్రహింసల నిలయమా?

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ఆగ్రహం



**బేతంచెర్ల: జూలై 23(ప్రజా జ్యోతి)**దవిద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన పాఠశాల రాక్షస ఆనందానికి, చిత్రహింసలకు నిలయంగా మారిందని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బేతంచెర్ల పట్టణంలోని శ్రీ నారాయణ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలుడిపై హెడ్మాస్టర్ సురేష్ బాబు, పాఠశాల సిబ్బంది అమానుషంగా దాడి చేసిన ఘటనను నిరసిస్తూ గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ... ఎలాంటి తప్పు చేయని పసివాడని కూడా చూడకుండా హెచ్ఎం సురేష్ బాబు సదరు విద్యార్థి పొత్తికడుపులో పిడిగుద్దులు గుద్ది, కాలికింద వేసి క్రూరంగా తొక్కి చేయి విరగొట్టడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యాసంస్థలు నడపాల్సిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలకు వేల రూపాయలు పీడిస్తూ వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యను అందించడానికి బదులుగా పసిపిల్లలను చిత్రహింసలకు గురిచేస్తూ రాక్షస ఆనందాన్ని పొందుతున్నారని ధ్వజమెత్తారు.శ్రీ నారాయణ పాఠశాల విద్యాబోధనను పూర్తిగా విడిచిపెట్టి పక్కా వ్యాపార కేంద్రంగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, పెన్నులు, షూ, టై, బెల్టు, బ్లేజర్లు అమ్మడంతో పాటు నాణ్యత లేని ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు.విద్యార్థిపై క్రూరంగా దాడి చేసి చేయి విరగొట్టిన హెచ్ఎం సురేష్ బాబుతో పాటు, దానికి సహకరించిన పాఠశాల సిబ్బందిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని రంగనాయుడు డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనలను బొందపెట్టి అక్రమాలకు పాల్పడుతున్న శ్రీ నారాయణ పాఠశాల గుర్తింపును విద్యాశాఖ అధికారులు తక్షణమే రద్దు చేయాలన్నారు.బాధ్యులపై పూర్తిస్థాయిలో కఠిన చర్యలు తీసుకోని పక్షంలో జిల్లా కలెక్టర్, డీఈఓ ల దృష్టికి తీసుకెళ్లి ఆందోళనలను, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి అక్రమాలకు, అరాచకాలకు పాల్పడుతున్న శ్రీ నారాయణ పాఠశాల యాజమాన్యంపై, హెచ్ఎంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రంగనాయుడు డిమాండ్ చేశారు.

# విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 23 (ప్రజా జ్యోతి)** ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బద్వేల్ సబ్ డివిజన్ నందు ఆగస్టు 10వ తేదీన జరిగే చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బి. నాయబ్ రసూల్ (రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్ట్రగుల్ కమిటీ), ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.శ్రీనివాసులులు మాట్లాడుతూ తెలంగాణ తరహాలోనే ఆంధ్రప్రదేశ్ లో కూడా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ (పి.ఆర్.సి) ఒప్పంద గడువు గత మార్చి లోనే ముగిసిందని కాబట్టి వెంటనే వేతన సవరణ సంప్రదింపుల కమిటీని నియమించి చర్చలు జరపాలన్నారు. ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న 4 డీఏ లను తక్షణమే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.48 వేలు అమలు చేయాలన్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని తొలగించి, యాజమాన్యమే నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని, దీనివల్ల సంస్థకు కోట్ల రూపాయలు ఆదా అవ్వడమే కాకుండా కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు.టాటా ఏ ఐ జీ ఇన్సూరెన్స్ కారణంగా విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకోవాలి. టాటా ఏఐజి ఇన్సూరెన్స్ పైన యాజమాన్యం చర్యలు తీసుకున్నంత వరకు ఎస్పీడీసీఎల్ పరిధిలో పాత ఇన్సూరెన్స్ ప్రకారము బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, అనుభవజ్ఞులైన కాంట్రాక్ట్ కార్మికుల తోనే భర్తీ చేయాలన్నారు. మైదుకూరు డివిజన్లో కాశీనాయన కలసపాడు సెక్షన్ల లో నూతన లైన్ ఇన్స్పెక్టర్ పోస్టులు మంజూరు చేయాలని మైదుకూరు డివిజన్ హెడ్ క్వార్టర్ నందు ఎస్.ఎల్.ఐ పోస్టులు, ఫోర్ మెన్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నాటి జేఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని,ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న స్కిల్డ్ కాంట్రాక్ట్ కార్మికులను హై స్కిల్డ్ కార్మికులుగా మార్చి, వేతన వ్యత్యాసాలను సవరించాలన్నారు. మైదుకూరు డివిజన్లో ఓఎమ్ కార్మికులకు గత 11 నెలల నుంచి ప్రమోషన్ సౌకర్యం కల్పించలేదని వారికి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు.పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విద్యుత్ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం తో పాటు రూ. 1 కోటి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. యువ గళం పాదయాత్రలో విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలన్నారు.ఏపీ జెన్ కో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించడంలో రాత్రింబవళ్లు కష్టపడుతున్న కార్మికుల పాత్ర కీలకమైందని, ప్రభుత్వం కేవలం ప్రశంసలు, అభినందన లకే పరిమితం కాకుండా, కార్మికుల నిజమైన డిమాండ్లను పరిష్కరించి నప్పుడే వారికి న్యాయం జరుగుతుందని కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ 10 లక్షలు ప్రకటించాలన్నారు. ఆగస్టు 10 తేదీన చలో విజయవాడ కార్యక్రమని కి బద్వేల్ సబ్ డివిజన్లోని కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డివిజన్ ట్రెజరర్ ప్రసాద్, డిస్కం ఉపాధ్యక్షులు నాగరాజు, మైదుకూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్ని కృష్ణ, మైదుకూరు డివిజన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పీసీ కొండయ్య, లోకేష్ యాదవ్, ఎద్దు గోపాల్, సుబ్బారావు, ప్రశాంత్, అబ్దుల్ వల్లి, లైన్మెన్ శీను,పెంచలయ్య, మల్లికార్జున, ఆది, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం అభివృద్ధి పై ప్రచారం విజయవంతం చేయాలి

: ఎమ్మెల్యే పితాని

ఈనెల 27 నుంచి ఇంటింటి ప్రచారం



**పోడూరు, (ప్రజాజ్యోతి), – జులై –23 :** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా చేస్తున్న కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు చైతన్యం పరిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి ఏపీ శాసనసభ హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నాయకులకు పిలుపునిచ్చారు. కోడూరు మండలం కొమ్ముచిక్కాల పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులు, నాయకులతో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు, ఓటరు జాబితా (సర్)లో జరుగుతున్న మార్పులు, చేర్పులపై సవివరంగా చర్చించారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ నెల 27వ తేదీ నుంచి "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రసారం" (డోర్ టు డోర్) కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని, ప్రభుత్వం సాధించిన అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

: మురుగేశన్

**ఓఎన్జిసి, సత్యం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో**

**200 మొక్కలు నాటే కార్యక్రమం**


**పోడూరు, (ప్రజా జ్యోతి), - జులై -23 :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఓఎన్జీసీ కేజీ--పీజీ బేసిన్ బేసిన్ మేనేజర్ శ్రీ ఈ. మురుగేశన్ పేర్కొన్నారు. ఓఎన్జీసీ కేజీ--పీజీ బేసిన్, రాజమండ్రి వారి సి.ఎస్.ఆర్. నిధులతో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (పి ఎస్ ఓ), సత్యం చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పోడూరు కల్నల్ డి ఎస్ రాజు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 200 పండ్ల మొక్కలు, నీడనిచ్చే వృక్షాలను నాటి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జీసీ కేజీ--పీజీ బేసిన్ బేసిన్ మేనేజర్ ఈ. మురుగేశన్, హెడ్ హెచ్ఆర్ ఆర్. రామారావు, జనరల్ మేనేజర్ పాల జైవర్, జనరల్ మేనేజర్ అనిల్ కుమార్, చీఫ్ జియోఫిజిసిస్ట్ కె. ముత్తయ్య, యశ్వంత్ కుమార్, పూడూరు కూటమి నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ అధికారులు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, వాతావరణ కాలుష్య నేపథ్యంలో ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. పాఠశాలల్లో మొక్కలు నాటడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందుతుందని, నేడు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, నీడ, పండ్లు మరియు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తుందని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు తమ సొంత మొక్కగా భావించి సంరక్షించాలని, ప్రతి పాఠశాల పచ్చదనానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఓఎన్జీసీ సంస్థ సమాజాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విద్యా రంగానికి తన సి.ఎస్.ఆర్. కార్యక్రమాల ద్వారా నిరంతరం సేవలందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాట్నాల నాగేశ్వరావు, ఇతర సభ్యులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు బాల బాలికలు గ్రామ ప్రముఖులు చిలుకూరు ప్రసాద్, శీలం జయరాం కృష్ణ బొక్క గణపతి, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, సత్యం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## రౌడూర్ గ్రామంలో ఘనంగా ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి జన్మదిన వేడుకలు..

**:-అభిమానుల సందడిలో ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి పుట్టినరోజు వేడుకలు..**

**:-ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి దీర్ఘాయుష్షు కోరుతూ కేక్ కట్ చేసిన మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్. యమ్.సుధాకర్ రెడ్డి,అభిమానులు..**




**కౌతాళం, జులై, 23 ప్రజా జ్యోతి** గురువారం రోజున మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కౌతాళం మండల పరిధిలోని రౌడూర్ గ్రామంలో గురువారం రోజున ఘనంగా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండి ప్రజలకు మరింత సేవ చేసేలా దేవుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువ నాయకులు,పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఎం సుధాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, సోమిరెడ్డి,నరసన్న గౌడ్,ఎన్.యల్లారెడ్డి, పంపా రెడ్డి, ఆర్ రాఘవేందర్ రెడ్డి,అల్లప్ప,ఎన్, ఎల్లప్ప,ఎన్.లక్ష్మన్న, ముఖేష్,మానప్ప, ఎన్.బసవ, ఆర్కె క్రిష్టప్ప,మాల వీరేష్,మాల శేఖర్, వినోద్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.ఖన

## నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ఈరన్న స్వామికీ ప్రత్యేక పూజలు చేసిన.. నందమూరి అభిమానులు





**కౌతాళం జూలై 23 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో మంత్రాలయం నియోజవర్గం నందమూరి అభిమానులు ప్రత్యేక పూజలు చేశారు. పద్మభూషణ్ నట సింహం నందమూరి బాలకృష్ణకి ఎన్బికె 111 సినిమా షూటింగ్లో మోకాలికి స్వల్ప గాయం అయినది కావున ఆయన త్వరగా కోలుకోవాలని ఆ దేవదేవుడైన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు జరిపించడం జరిగినది. మరియు కొబ్బరికాయలు కొట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రాలయం తాలూకా ప్రెసిడెంట్ ఉరుకుంద నరసింహనాయుడు, కౌతాళం రహిమాన్, ముకయ్య,సూర్య, రామంజి, అశ్వద్ధామ,బసవ మరియు అభిమానులు పాల్గొన్నారు.


## డాక్యుమెంట్ రైటర్లకు మద్దతు తెలిపిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు



**గుంతకల్లు జులై 23 (ప్రజా జ్యోతి):** గురువారం పట్టణంలోని రిజిస్టర్ ఆఫీస్ దగ్గర డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన దీక్షకు గుంతకల్లు కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ మద్దతు ప్రకటించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిని కోల్పోయే ప్రమాదంగా ఉన్న జీవో నెంబర్ 396 ను వెంటనే రద్దుచేసి డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ దీక్షలో కూర్చున్న డాక్యుమెంట్ రైటర్రైటర్స్ సురేష్, శంకర్, ఆనంద్, జాకీర్, గోపి, శ్రీనివాసులు,భాష, రాజు, భాస్కర్ రెడ్డి మొదలగు వారు దీక్షలో ఉన్నారు.

## కార్యకర్తకు భరోసా ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూలై 23 (ప్రజా జ్యోతి)** బద్వేల్ నియోజకవర్గం అనంతరాజపురం పంచాయతీ తిమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త దుర్వాసుల వీరమరాజు గత కొంతకాలంగా తీవ్ర మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ మాజీ శాసనసభ్యురాలు విజయమ్మ గురువారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. వీరమరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆమె తిమ్మరాజుపల్లె గ్రామ పెద్దలతో సమావేశమై, గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మండలం సొసైటీ అధ్యక్షుడు మన్యం రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బైసాని ప్రతాపరెడ్డి, రైల్వే కాంట్రాక్టర్ మేరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జోగిరెడ్డిగారిపల్లి మాజీ ఎంపీటీసీ జయరాములు, రామరాజు, కుమార్, శ్రీనివాసరాజు, సుబ్బరాజు, వెంకట సుబ్బరాజు, ఎలక్ట్రికల్ వెంకటసుబ్బారెడ్డి, డీలర్ శ్రీనివాసులు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పేరయ్య, శీను, రవి, చిన్నయ్య, రమణ, వెంకటసుబ్బయ్య, ఈగ సుబ్బారెడ్డి, మెకానిక్ వెంకటసుబ్బారెడ్డి, శివకుమార్, పొన్న రాజేష్, సిద్ధ మూర్తి, మహేశ్వర్ రెడ్డి, బిజివేముల విజయ్ రెడ్డి, వీరారెడ్డి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డొంకరాయి చెక్‌పోస్ట్ వద్ద 10 కిలోల గంజాయి స్వాధీనం

**-- ఇద్దరు నిందితులు అరెస్ట్**



**డొంకరాయి, జూలై 23:** ప్రజా జ్యోతి డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, జూలై 22 సాయంత్రం 5 గంటల సమయంలో ఒడిశా రాష్ట్రంలోని పశువులంక గ్రామం నుంచి గుంటూరుకు పల్సర్ బైక్‌పై 10 కిలోల గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం అందడంతో ఎస్సై చరణ్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు డొంకరాయి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.పోలీసులను గమనించిన నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో కుందేటి చెన్నకేశవరావు (20), సద్దాం పవన్ మాధవ్ (21), ఇద్దరూ గుంటూరు ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

## ఎరిగేరి గ్రామంలో వైసీపీ సీనియర్ నాయకులు నీలకంఠ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి జన్మదిన వేడుకలు



**కౌతాళం జూలై 23 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో గురువారం రోజున మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా అభిమానులు కార్యకర్తలు మధ్యన భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాల నాగి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన ఇలాంటి పుట్టినరోజులను మరెన్నో జరుపుకోవాలని అలాగే ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఉండాలని,ముందు ముందు ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు నీలకంఠ రెడ్డి,మాజీ సర్పంచ్ గోవిందు, వైసిపి నాయకులు ఎమ్మెల్యే అభిమానులు కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు పోడూరు, ఆచంటలలో పేరెంట్, టీచర్స్ సమావేశం

**హాజరు కానున్న ఎమ్మెల్యే పితాని**



**పోడూరు, జులై 23(ప్రజా జ్యోతి):** పోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల, ఆచంట జూనియర్ ప్రభుత్వ కళాశాలలో పేరెంట్, టీచర్స్ సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవస్థలను గాడిలో పెట్టే విధంగా ప్రణాళికలు తీసుకున్నారని ఎమ్మెల్యే రాధాకృష్ణ వివరించారు. ఎఅఆ

## కౌతాళంలో ఎస్ ఎస్ ట్యాంకును పరిశీలించిన కౌతాళం వైసీపీ నాయకులు



**కౌతాళం జూలై 23 ప్రజా జ్యోతి** మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగి రెడ్డి పిలుపుమేరకు కౌతాళం మండలంలో రాజనగర్ క్యాంప్ లో ఉన్న ఎస్ఎస్ ట్యాంకును వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద ఆచార్ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది.ప్రభుత్వ అధికారులు మరియు నీటిపారుదల ఇరిగేషన్ అధికారులు వారికి పంపింగ్ తో మరియు టాక్టర్లతో నీకు ట్యాంకులోకి నింపుతున్నారు మంచిది కానీ కాలువకు నీళ్లు ఎక్కువ రోజులు ఉండవు కాబట్టి దానిని దృష్టిలో ఉంచుకొని ఇంకో మూడు నాలుగు టాక్టర్లతో నీళ్లు పంపింగ్ చేయండని వైస్సార్సీపీ నాయకులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,పిఏ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచులు అవతారం,పాల్ దినకర్,ఉపసర్పంచ్ సక్రి తిక్కయ్య, మండల నాయకులు సత్య స్వామి,వడ్డే రాము, వెంకటరామరాజు, సమ్మద్, లింగారెడ్డి, నర్సిరెడ్డి,పాల్ రెడ్డి, ఉమాపతి,సక్రి శ్రీరామ్,బెస్త నాగరాజు,బెస్త నారాయణ, తహేర్ వలి, ఇద్రుస్,సూగర ప్పా ధని,వడ్డే అంజి,మహేంద్ర, మమ్మద్,ఎన్టీఆర్ నగర్ బాషా,సి. సుధాకర్ జి.డీ ఖదీర్,అశోక్ నంద మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## కౌతాళంలో ఘనంగా మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి జన్మదిన వేడుకలు



**కౌతాళం జూలై 23 ప్రజా జ్యోతి** కౌతాళంలో వైఎస్ఆర్సిపి పార్టీ ఆఫీస్ నందు కార్యకర్తలు అభిమానులు మరియు నాయకులు మధ్యలో ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి జన్మదినం సందర్భంగా పెద్ద కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి పిఏ వెంకటరామిరెడ్డి మాజీ సర్పంచులు అవతారం పాల్ దినకర్ ఉపసర్పంచ్ సక్రి తిక్కయ్య మండల నాయకులు సత్య స్వామి,వడ్డే రాము, వెంకటరామరాజు, సమ్మద్, లింగారెడ్డి, నర్సిరెడ్డి,పాల్ రెడ్డి, పూజారి లింగ, ఉమాపతి,సక్రి శ్రీరామ్,బెస్త నాగరాజు,బెస్త నారాయణ, వైఎస్ఆర్సిపి యువజన మండల అధ్యక్షుడు తహేర్ వలి,ఇద్రుస్,సూగర ప్పా ధని,వడ్డే అంజి,మహేంద్ర, మమ్మద్,ఎన్టీఆర్ నగర్ బాషా,1 సి. సుధాకర్,జి.డి ఖదీర్,సోషల్ మీడియా మండల ఉపాధ్యక్షులు అశోక్ నంద మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు వార్డ్ మెంబర్లు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి జన్మదినం సందర్భంగా భోజనం వడ్డిస్తున్న కౌతాళం వైసిపి మండల కార్యదర్శి గుర్నాథ్ రెడ్డి



**కౌతాళం జూలై 23 ప్రజా జ్యోతి** మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలు శుభ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారి మాట్లాడుతూ ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అలాగే ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వారు తెలిపారు. అనంతరం ఆదోని బీమా సర్కిల్ నందు వైయస్సార్ అభిమానులకు,ప్రజలకు భోజనం వడ్డించిన కౌతాళం వైసిపి మండల కార్యదర్శి గురునాథ్ రెడ్డి ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం. 396 రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్లు చేస్తున్న పెన్డౌన్ సమ్మె కు సిపిఎం మద్దతు



**గుంతకల్లు జులై 23 (ప్రజా జ్యోతి):** డాక్యుమెంట్ రైటర్లకు ఉచితం కలిగించే జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్లు చేస్తున్న దీక్షకు గురువారం సిపిఎం నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రైవేట్ పరం చేస్తే ప్రయివేటు ఏజెన్సీలు లాభాపేక్షతో పని చేస్తాయి. కాలక్రమంగా 'యూజర్ ఛార్జీలు' లేదా 'సర్వీస్ ఛార్జీలు' పేరిట ప్రజల నుంచి అదనపు రుసుములు వసూలు చేస్తాయి. ప్రస్తుతం సబ్– రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లభించే ఎన్నో సేవలకు భవిష్యత్తులో భారీగా చెల్లించాల్సి రావచ్చు. ఈ సేవా కేంద్రాలు పూర్తిగా ఆన్లైన్, డిజిటల్ విధా నంలో నడుస్తాయి. చదువుకుని, సాంకేతికతపై కనీస అవగాహన లేని గ్రామీణ రైతులకు ఈవ్యవస్థను అర్ధం చేసు కోవడం క్లిష్టంగా మారుతుం ది. ఆన్లైన్ ప్రక్రియలు తెలియని అమాయక ప్రజలను ఆసరాగా చేసు కుని, ప్రయివేటు కేంద్రాల చుట్టూ కొత్త రకమైన దళారులు తయారై సామా న్యులను మరింత దోపిడీ చేసే ప్రమాదం ఉంది. ఈ జీవో అమలులోకి వస్తే కేవలం దస్తావేజు లేఖర్లు వారిపై ఆధారపడిన స్టాంప్ వెండర్లు టైపిస్టులు డిటిపి ఆపరేటర్లు జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు రిజిస్టర్ ఆఫీస్ వద్ద చిన్నచిన్న వ్యాపారం చేసుకునే లక్ష లాది కుటుంబాల జీవనో పాధి పూర్తిగా దెబ్బతింటుం ది తరతరాలు గా ఈ వృత్తిని నమ్ముకొని చట్టాలపై స్థానిక అవగాహన పెంచుకున్న అనుభవజ్ఞుల స్థానంలో పెద్దపెద్ద ప్రైవేట్ ఏజెన్సీలు కార్పొరేట్ సంస్థలు టెండ ర్లను దక్కించుకుంటాయి దీంతో సంపద ఉపాధి కొంతమంది కార్పొరేట్ శక్తుల చేతుల్లోనే కేంద్రీకృత మై అవుతుంది. వ్యక్తులకు సంబంధించి విలువైన ఆస్తుల వివరాలు ఆధార్ కార్డు వేలిముద్రలు పాన్ కార్డ్ వంటి అత్యంత గోప్య మైన సమాచారం ప్రైవేట్ ఏజెన్సీల సర్వర్లలో నిక్షిత మవుతుంది ప్రభుత్వం నియంత్రణ లేని ప్రవేట్ సర్వర్లలో డేటాభద్రతకు గ్యారెంటీ లేదు దీంట్లో డేటా లీక్ అయ్యే ముప్పు ఉంది. ప్రభుత్వం అధికారులకు ఉండే జవాబిదారితనం ప్రైవేట్ సెంటర్లో పనిచేసే తాత్కాలిక సిబ్బందికి ఉండదు. దీనివల్ల ఫోర్జరీ డాక్యుమెంట్స్ సృష్టించి ఒకరు భూమిని మరొక పేరిట డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం మోసపూరిత లావాదేవులు పెరిగే అవ కాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా కూటమి ప్రభు త్వం లేఖరులకు, ప్రజలకు నష్టం కలిగించే 396 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లేఖరులు చేసే ప్రతి కార్య క్రమంలో సిపిఎం పార్టీ ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సురేంద్ర, రంగమ్మ పట్టణ కమిటీ సభ్యులు షాష, ఉలిగప్ప, వంశి, మక్బూల్ పాల్గొన్నారు.

## జిల్లాకు సాగునీటి భద్రత కల్పించడమే లక్ష్యం

- జిల్లా వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం
- నేరడి బ్యారేజి నిర్మాణంతో వేలాది ఎకరాలకు సాగునీరు
- నేరడి బ్యారేజికి రూ. 641.10 కోట్ల పరిపాలనా అనుమతులు
- రైతన్నల శ్రేయస్సుకు పెద్దపేట
- రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది
- రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్





**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** దశాబ్దాలుగా శ్రీకాకుళం జిల్లా రైతాంగం ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంపై ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, 61 సంవత్సరాలుగా శ్రీకాకుళం రైతులు కలగంటున్న నేరడి బ్యారేజీ ఇప్పుడు సాకారం దిశగా అడుగులు వేయడం జిల్లా అభివృద్ధికి శుభపరిణామమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరడి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి, జలవనరుల శాఖ మంత్రితో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సాధించేందుకు చేసిన కృషి నేడు ఫలించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సాగునీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతాంగానికి కొత్త ఆశలు నింపిందన్నారు. నేరడి బ్యారేజీ పూర్తయితే వంశధార జలాలతో వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి జిల్లా వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్, జిల్లా ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకత్వం సమష్టిగా కృషి చేశారని కూన రవికుమార్ కొనియాడారు. తాను కూడా నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం నిరంతరం ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో పాటు అవసరమైన అన్ని స్థాయిల్లో సమన్వయం చేస్తూ నిర్విరామంగా కృషి చేశానని తెలిపారు. మాట ఇస్తే నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు నాయుడు. పట్టుదలతో ప్రజల కలలను నిజం చేసే నాయకత్వమే కూటమి ప్రభుత్వ ప్రత్యేకత. నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తయి సిక్కోలు రైతన్న ముఖంలో చిరునవ్వు చూడటమే మా లక్ష్యం" అని కూన రవికుమార్ అన్నారు. నేరడి బ్యారేజీకి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు కావడం ద్వారా శ్రీకాకుళం జిల్లా సాగునీటి రంగంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, సిక్కోలు అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, జిల్లాలో శాశ్వత సాగునీటి వసతుల కల్పన దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాత శిశు సంరక్షణ సేవలపై తనిఖీ చేసిన జిల్లా వైద్యశాఖ అధికారులు



**బ్రహ్మంగారిమఠం –ప్రజా జ్యోతి జులై 23** మండల కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ సేవలపై గురువారం జిల్లా వైద్యశాఖ అధికారులు తనిఖీ చేశారు. బి.మఠం మండలం, పలుగురాళ్లపల్లె పీహెచ్సీ లో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందుతున్న సేవలపై జిల్లా స్టాటికల్ అధికారి ఏ.రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించడం జరిగింది. రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలు, వ్యాధి నిరోధక టీకాలు, యుక్త వయసులో ఉన్న బాలికల రక్తహీనత మొదలగు సేవలపై ఈ బృందం తనిఖీ చేయడం జరిగింది. అలాగే ఆర్ సి హెచ్ పోర్టల్, ఏం సి పి కార్డులు, ఆర్ సి హెచ్ 2.0 రిజిస్టర్, పుట్టింటికి వచ్చిన గర్భవతులు మొదలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. మరియు గర్భవతులకు కిషోర్ బాలికలకు రక్తపరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతాన్ని సరిచూశారు. ప్రతి గర్భిణీ స్త్రీ కి 12 వారాలలోపు నమోదు చేసి రెండు డోసులు టీడీ వ్యాక్సిన్, 180 ఐరన్ ఫోలిక్ మాత్రలు, 360 క్యాల్షియం మాత్రలు మింగించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, ప్రతి ప్రసవము ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగాలని వారు సూచించారు. అలాగే పి ఎం ఎం వివై, పి ఎం ఎస్ ఎంఎ, జె ఎస్ వై, జె ఎస్ ఎస్ కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ తనిఖీ లో భాగంగా కొన్ని లోపాలను గుర్తించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఏఎన్ఎంలకు ఏం ఎల్ హెచ్ పి లకు సూచనలు చేశారు. అదేవిధంగా ఎన్సీపీ కార్డులు ఆర్ సి హెచ్ 2.0 రిజిస్టర్లు తప్పనిసరిగా పూర్తిగా ఇచ్చిన సర్వీసులను ఎప్పటికప్పుడు నింపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్స్ ఝాన్సీ, డాక్టర్ భాను శ్రీ, డిపిఓ కుమార్ నారాయణ, హెచ్ ఎం ఐ ఎస్ అధికారి రాజశేఖర్, ఎం పి హెచ్ ఈ ఓ ప్రసాద్, ఎం వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ వెంకటమ్మ, సూపర్వైజర్ సాలమ్మ, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ ఏం లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మనబడి మన బాధ్యత స్వచ్ఛభారత్ కార్యక్రమం

పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్





**హాలహర్వి జూలై 23, ప్రజా జ్యోతి :–**హాలహర్వి మండల పరిధిలోని పచ్చారపల్లి గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో "మనబడి మన బాధ్యత" పేరుతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తీసేసి, ఆవరణ మొత్తం గరుసు చదును చేశారు. పిల్లలు పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు యూత్ సభ్యులు తెలిపారు. పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, "మనబడి మన బాధ్యత" అనే నినాదంతో ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తు లో కూడా కొనసాగిస్తామని పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డోర్ టు డోర్ ప్రోగ్రాం విజయవంతం చేద్దాం

: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు జులై 23 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని కసాపురం రోడ్డు లో ఉన్న ఏబి ఫంక్షనల్ నందు నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ కృష్ణారెడ్డి, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన జరగబోయే డోర్ టు డోర్ ప్రోగ్రాం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలల్లో చేసిన అభివృద్ధి గురించి డోర్ టు డోర్ ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి తెలియజేయాలని తెలిపారు. అలాగే మీరు చేస్తున్న డోర్ టు డోర్ ప్రోగ్రాం మన గుంతకల్లు నియోజకవర్గం కార్యాల యం మరియు తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రతిక్షణం మనం చేస్తున్న పనిని గమనిస్తూనే ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్ర మంలో పాల్గొని డోర్ టు డోర్ ప్రోగ్రాం ని విజయ వంతం చేయవలసిందిగా తెలియజేస్తున్నాను మనము చేసిన అభివృద్ధిని ప్రజలల్లేకి తీసుకువెళ్లి మనం తెలియజేస్తేనే రాబోయే స్థానిక సంస్థ ఎలక్షన్లలో ఘనవిజయం సాధించడానికి వీలుగా ఉంటుంది అని సభాము ఖంగా తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గుంతక ల్లు నియోజకవర్గం నాయకు లు కార్యకర్తలు మరియు అనుబంధ కమిటీ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగింది.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

: డివైఎఫ్ఐ డిమాండ్



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూలై 23 (ప్రజా జ్యోతి)** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడిన 'నీట్' పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) బద్వేల్ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. నీట్ పరీక్షల అవకతవకలకు నిరసనగా జూలై 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) షేక్ శంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, కార్యదర్శి ఎస్.కె. ఆదిల్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ దారుణమైన అవకతవకలపై ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఒక స్వతంత్ర, పారదర్శక కమిటీతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 24న చేపట్టబోయే విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతు తెలిపి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ ఉపాధ్యక్షుడు సుధాకర్, సహాయ కార్యదర్శి నాగేంద్రబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

## గోమ్ముకొత్తగూడెంలో పోలీసుల అవగాహన సదస్సు

మాదకద్రవ్యాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు సీఐ వి. కృష్ణ సూచనలు



గోమ్ముకొత్తగూడెం ప్రజలకు సూచనలు చేస్తున్న సీఐ వి. కృష్ణ

**ఎటపాక, జూలై 23 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా చింతూరు సబ్ డివిజన్ పరిధిలోని ఎటపాక సర్కిల్ ఇన్ స్పెక్టర్ వి. కృష్ణ గురువారం సాయంత్రం మండల పరిధిలోని గోమ్ముకొత్తగూడెం గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళలపై వేధింపులు, నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గోదావరి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పవద్దని వివరించారు. గ్రామ ప్రజలు చట్టాలను గౌరవించి, పోలీసులతో సహకరించి సురక్షిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సీఐ వి. కృష్ణ పిలుపునిచ్చారు.

## కోదండ రామాలయంలో ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

- శాకాంబరీ దేవిగా భక్తులకు అమ్మవారి దర్శనం
- ఓం శ్రీ వారాహి దేవీయై నమః అంటూ మారుమ్రోగిన ఆలయ ప్రాంగణం







**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**అత్యంత విశిష్టమైన వారాహి గుప్త నవరాత్రి వేడుకలను పొందూరు మండల కేంద్రంలో మార్కెట్ ఆవరణంలో వెలసియున్న శ్రీ కోదండ రామాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు ఈ మహోత్సవాలు అత్యంత మహోత్సవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు జగన్నాథాచార్యులు వేద మంత్రోర్చనలతో వారాహి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం నాడు నవమిని పురస్కరించుకుని అమ్మవారు శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఓం నమో శ్రీ వారాహి దేవియే నమః అంటూ అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. దీపకాంతులతో ఆలయం కళకళలాడింది. పూజా కార్యక్రమం అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యంగ్ స్టార్ యూత్ క్లబ్ మాజీ అధ్యక్షులు గుడ్ల చంద్ర ఆచంటి రమేష్, పట్నాన శ్రీను , రేజేటి సుబ్రమణ్యం పలువురు భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

# రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్'లో దక్షిణాది బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్

## కొత్త జోడీపై పెరిగిన ఆసక్తి



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందుతున్న ఈ సినిమా గురించి వస్తున్న తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. తదుపరి షూటింగ్ షెడ్యూల్ కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి రణ్‌వీర్ సింగ్ -- కళ్యాణి ప్రియదర్శన్ కాంబినేషన్ నిజమైతే, ఇది దక్షిణాది -- బాలీవుడ్ కలయికలో మరో ఆసక్తికర జోడీగా నిలిచే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కొత్త జంట వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే అధికారిక ప్రకటనతో పాటు సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.

# జబర్ధస్త్ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్.. ఆమె స్పందన ఏంటి?




జబర్దస్త్ కామెడీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి సత్యశ్రీ ప్రస్తుతం సినిమాల్లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్నారు. టెలివిజన్‌కు దూరంగా ఉంటూ వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, కెరీర్ ఎంపికలు, అలాగే బిగ్‌బాస్ ఆఫర్‌ను ఎందుకు తిరస్కరించారనే విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జబర్దస్త్ తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు రావడంతో టెలివిజన్‌లో తక్కువగా కనిపిస్తున్నానని సత్యశ్రీ తెలిపారు. కెరీర్ ప్రారంభంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని స్వీకరించినప్పటికీ, ఇప్పుడు మాత్రం పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని చెప్పారు. ఇప్పుడు నేను ఉన్న దశలో నా ఇమేజ్, రెప్యుటేషన్‌ను దృష్టిలో పెట్టుకుని పాత్రలు ఎంచుకుంటున్నాను. గ్లామర్ ఉన్నంతవరకు మంచి అవకాశాలను సెలెక్టివ్‌గా చేయాలనుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన 'అనగనగా ఒక రాజు' చిత్రంలో నటించిన సత్యశ్రీ, హీరో నవీన్ పొలిశెట్టి గురించి కూడా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సెట్స్‌లో నవీన్ ఎప్పుడూ పనిపైనే దృష్టి పెట్టే వ్యక్తి అని, ప్రతి క్షణం సినిమా గురించే ఆలోచిస్తుంటారని చెప్పారు. నవీన్ గారితో మాట్లాడింది చాలా తక్కువ. కానీ ఆయన పని చేసే విధానాన్ని దగ్గరగా చూసే అవకాశం వచ్చింది. 'జాతిరత్నాలు' సమయంలోనే మరో సినిమాలో కలిసి పని చేద్దామని ఆయన చెప్పారు. ఆ మాటను నిలబెట్టుకుని 'అనగనగా ఒక రాజు'లో అవకాశం ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది" అని సత్యశ్రీ తెలిపారు. ఇటీవల బిగ్‌బాస్ తెలుగు సీజన్-10 కోసం సత్యశ్రీకి ఆఫర్ వచ్చిందనే వార్తలపై కూడా ఆమె స్పందించారు. ఆ వార్తల్లో నిజం ఉందని, కానీ కుటుంబ పరిస్థితుల కారణంగా ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. నాకు బిగ్‌బాస్ నుంచి ఆఫర్ వచ్చింది. కానీ నేను మా కుటుంబ బాధ్యతలను చూసుకుంటున్నాను. అమ్మానాన్నలను అంతకాలం వదిలి వెళ్లడం నాకు సాధ్యం కాదు. వారికి తోడుగా ఉండాల్సిన బాధ్యత నాదే. అందుకే ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించాను అని ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఉంటుందని, కానీ చాలామందికి వారి బాధ్యతలు పంచుకునే వారు ఉంటారని, తన పరిస్థితి మాత్రం భిన్నమని సత్యశ్రీ వివరించారు. అందుకే కెరీర్ కంటే కుటుంబానికే ప్రాధాన్యం ఇచ్చానని స్పష్టం చేశారు.




# క్రేజీ టాక్.. నందమూరి హీరోను లైన్‌లో పెట్టిన పరశురాం!



సోలో, గీత గోవిందం, సర్కారు వారి పాట ఫ్యామిలీ ఆడియెన్స్‌లో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు టాలీవుడ్ డైరెక్టర్ పరశురాం. ఈ క్రేజీ డైరెక్టర్ 2024లో వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమా తర్వాత కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఇప్పుడు పరశురాం కొత్త సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఈ సారి నందమూరి హీరోతో సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడన్న న్యూస్ ఒకటి తెరపైకి వచ్చింది. ఇంతకీ ఎవరా హీరో అనే కదా మీ డౌటు.. పటాస్ హీరో నందమూరి కల్యాణ్ రామ్. తాజా టాక్ ప్రకారం పరశురాం ఇప్పటికే కల్యాణ్ రామ్‌కు ఓ ఐడియాను చెప్పాడట. కల్యాణ్ రామ్‌కు పరశురాం చెప్పిన బేసిక్ ఐడియా నచ్చిందట. ఈ క్రమంలో పరశురాం పూర్తి స్థాయిలో స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నాడని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం కల్యాణ్ రామ్ అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న మల్టీ స్టారర్‌తో బిజీగా ఉన్నాడు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరతే ఈ మూవీ పూర్తయిన తర్వాత కల్యాణ్ రామ్, పరశురాం సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశమున్నట్టు సమాచారం. క్లాస్, మాస్ టచ్‌తో మంచి సందేశాన్ని జోడిస్తూ.. ఎంటర్‌టైన్ చేసే ప్రయత్నం చేయడంలో ఎప్పుడూ ముందుంటాడు పరశు రాం. మరి ఈ సారి కల్యాణ్ రామ్‌తో ఎలాంటి సబ్జెక్టును రెడీ చేశాడనేది ఆసక్తి నెలకొంది. దీనిపై రాబోయే రోజుల్లో కొత్త అప్‌డేట్ వస్తుందేమో చూడాలి.

# 'టాక్సిక్'పై నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు.. ఇది పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక చిత్రం

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే, ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,